Follow: @ANNTELUGU

08-10-2025

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 303 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


ANN తెలుగు



## సమ్మక్క సారలమ్మ విశ్వవిద్యాలయం లోగో ఆవిష్కరణ

కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ

లోగో రూపకల్పనలో సృజనాత్మకత ఇమిడి ఉంది: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**ఢిల్లీ, మహా:** ప్రధాని దూరదృష్టి, కిషన్‌రెడ్డి చొరవతో తెలంగాణలో గిరిజనుల కోసం ప్రత్యేక యూనివర్సిటీ ఉండాలనే కల నిజమైందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, కిషన్‌రెడ్డి ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమ్మక్క, సారలమ్మ కేంద్ర విశ్వవిద్యాలయం లోగోను ఆవిష్కరించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ సమ్మక్క సారలమ్మ పండుగ జరుపుకోనున్న సందర్భంగా... వారి పేరుతో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించిందని, భవనాల నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలని

మిగతా 3లో

టాప్ న్యూస్

## పవన్ సినిమాలో విలన్ ఆఫర్

- రూ.3 కోట్లు కూడా ఇస్తామన్నారు
- మాజీమంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు

02



ZOHO

## ఇకపై అన్ని కార్యక్రమాలు జోహో ఆఫీస్ సూట్ ద్వారానే

- మైక్రోసాఫ్ట్, గూగుల్‌కు గుడ్ బై
- స్వదేశీ యాప్ కేంద్ర విద్యాశాఖ నిర్ణయం

02

## ప్రధానిని నిలదీసే దమ్ములేదా?

- బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఫైర్
- టెండర్లు పిలిచి ఎందుకు ఓపెన్ చేయడం లేదు?

02




SRI GOLD
TRUSTED GOLD BUYERS


**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,19,400 |
| 22 క్యారెట్ | 1,09,450 |
| సిల్వర్ (కేజీ) | 1,55,000 |



## తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు భేటీ

**కమిటీలకు గ్రీన్ సిగ్నల్ .. సంస్థాగత నిర్మాణంపై ఫోకస్**

**అమరావతి, మహా :** తెలుగుదేశం తెలంగాణ నేతలతో పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేతలతో పలు కీలక అంశాలపై చర్చించారు . తెలంగాణలో పార్టీ కమిటీల నియామకంపై చర్చించారు.

మిగతా 3లో

## పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

వివరాలు 2లో

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,207.17 |
| నిఫ్టీ | 24,894.25 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.05 | 151.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.05 | 151.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.35 | 160.15 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 190 | 230 | 250 |
| హోల్ సేల్ ధర | 170 | 210 | 220 |

## బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ ఫుల్ ఫోకస్



### సర్వశక్తులు ఒడ్డుతున్న రాష్ట్ర సర్కార్

హైకోర్టులో విచారణ నేపథ్యంలో కీలక భేటీలు

గంటగంటకూ పరిస్థితి అంచనా వేస్తూ ముందుకు

ముఖ్యనేతలు, న్యాయనిపుణులతో వరుస సమావేశాలు

చర్చల్లో మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్, భట్టి, ఉత్తమ్ సహా కీలక మంత్రులు హాజరు


వాదనలు వినిపించేందుకు ప్రత్యేకంగా వచ్చిన అభిషేక్ సింగ్వీ

బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా హైకోర్టులో పలువురు ఇంప్లీడ్ ..

ఆది శ్రీనివాస్, ఆర్ కృష్ణయ్య , తీన్మార్ మల్లన్న, ఇందిరా శోభన్, చరణ్ కౌశిక్ సహా పలువురు ఇంప్లీడ్

**హైదరాబాద్, మహా :** బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీసీలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై అడుగడుగునా జాగ్రత్తలు చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు, హైకోర్టులోను కేసు గెలిచేందుకు తన సర్వశక్తులు ఒడ్డుతోంది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గంటగంటకు పరిస్థితిని అంచనా వేస్తూ ముందుకు వెళుతుంది. బుధవారం హైకోర్టులో బీసీ రిజర్వేషన్ కేసు విచారణ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, చేపట్టాల్సిన చర్యలు తదితర అనుబంధ అంశాలను చర్చించేందుకు ఏకైక ఎజెండాతో మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

మిగతా 2లో






## మంత్రుల మధ్య క్యాస్ట్ వార్

### మాదిగోడినే నాపై చిన్నచూపు

క్షమాపణ చెప్పకుంటే హైకమాండ్ తో తేల్చుకుంటా...

..మంత్రి పొన్నంపై మరో మంత్రి అడ్లూరి షాకింగ్ కామెంట్స్

మంత్రి వివేక్ పైనా ఆరోపణలు

మాదిగ మంత్రిని అవమానిస్తారా? మందకృష్ణ ఫైర్

పొన్నం వ్యాఖ్యల నేపథ్యంలో పీసీసీ చీఫ్ ను కలిసిన మాదిగ ఎమ్మెల్యేలు

సీన్ లోకి పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్.. ఇరువురు మంత్రులకు ఫోన్

తగ్గేదెలే అంటున్న అడ్లూరి .. పలుచోట్ల పొన్నంకు వ్యతిరేకంగా నిరసనలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కేబినెట్ మంత్రుల మధ్య కులకలం రచ్చరచ్చగా మారింది. పొన్నం చేసిన దున్నపోతు వ్యాఖ్యలు పొలిటికల్ తుఫాన్ కు కారణమయ్యాయి. మాదిగోడు నాతో సమానంగా కూర్చుంటడా అన్న డబ్బుమదంతోనే పొన్నం ప్రభాకర్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఫైర్ అయ్యారు. ఆగస్టు 15న కరీంనగర్ లో మంత్రిగా తాను జెండా ఎగురవేసిన నాటి నుంచి పొన్నం ఓర్వలేకపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన వాడిని కాబట్టే తనపై పొన్నం ప్రభాకర్ చిన్నచూపు చూస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ప్రెస్ మీట్లో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారానికి దారి తీశాయి. ఆ ప్రెస్ మీట్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ తో పాటు అడ్లూరి లక్ష్మణ్ పాల్గొనాల్సి ఉంది.

మిగతా 3లో

## గ్రూప్1 నియామకాలకు రైట్ రైట్

స్టే ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరణ

హైకోర్టు డివిజన్‌బెంచ్ విచారణే ఫైనల్

02

## వరి ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ టాప్

రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఇదే రికార్డ్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, మహా : రాష్ట్రం ధాన్యం దిగుబడిలో దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించబోతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వానాకాలం సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ఉంటుందని, దేశ చరిత్రలోనే ఇప్పటి వరకు ఇంతటి దిగుబడి ఎక్కడ నమోదు కాలేదన్నారు. మంగళవారం వానాకాలం ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాల కేంద్ర కార్యాలయంలో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ ఇతర అధికారులు సమీక్ష నిర్వహించారు.


మిగతా 2లో



## నవీన్‌కు లైన్ క్లియర్

- సీఎం రేవంత్ మొగ్గు అటువైపే...
- జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నేడే రేపో ప్రకటించే అవకాశం

02

# బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ ఫుల్ ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ 6న సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింగ్వి, సిద్ధార్థ దవే లు వాదనలు వినిపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ హైకోర్టులో కూడా బీసీ రిజర్వేషన్ల కేసులో అక్టోబర్ 8న వాదనలు వినిపించాల్సిందిగా అభిషేక్ సింగ్వీని సీఎం రేవంత్ కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు హైకోర్టులో అక్టోబర్ 8న కేసు విచారణ నేపథ్యంలో స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని అభిషేక్ సింగ్వీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రుల బృందం ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో బుధవారం హైకోర్టులో ప్రభుత్వం తరఫున అభిషేక్ సింగ్వీ వాదనలు వినిపించనున్నారు. సీఎం నివాసంలో జరిగిన భేటీలో అభిషేక్ సింగ్వీ కూడా పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, మొత్తం 69 శాతం రిజర్వేషన్లు ఖరారుచేస్తూ ప్రభుత్వం జీవో 9 జారీచేయడంతో పాటు రిజర్వేషన్లు ఫైనల్ చేసింది. దీని ప్రకారం ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది.

**బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా పలువురు ఇంప్లీడ్**

పిటిషన్ పై హైకోర్టులో విచారణ నేపథ్యంలో ఈ కేసులో రాష్ట్ర మున్నూరు కాపు ఆపెక్స్ కమిటీ చైర్మన్ గా ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంప్లీడ్ అయ్యారు. అదే విధంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న కూడా ఇంప్లీడ్ అయ్యారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం జరగాలని ఆకాంక్షిస్తూనే తాను ఇంప్లీడ్ అయినట్టు చెప్పారు. 56% ఉన్న బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తే అగ్రకులాలకు మంటలేస్తోం దని అన్నారు. బీసీల ఎదుగుదలను అగ్ర కులా ఓర్వలేక పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టులో తమకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. రిజర్వేషన్లు వ్యతిరేకిస్తే తరిమికొడతామని అన్నారు. ఇప్పటి వరకు బీసీ ముఖ్యమంత్రి లేదని అన్నారు. బీసీలు చదువుకున్నప్పటికీ సరిపడా రిజర్వేషన్లు లేక ఉద్యోగాలు రావడం లేదని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా బీసీ రిజర్వేషన్ల పై దాఖలైన పిటిషన్ లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి చరణ్ కౌశిక్ యాదవ్, ఇందిరా శోభన్ కూడా ఇంప్లీడ్ అయ్యారు.

# ZOHO ఇకపై అన్ని కార్యక్రమాలు జోహో ఆఫీస్ సూట్ ద్వారానే

- మైక్రోసాఫ్ట్, గూగుల్‌కు గుడ్ బై
- స్వదేశీ యాప్ కేంద్ర విద్యాశాఖ నిర్ణయం

**ఢిల్లీ, మహా:** మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజాలకు క్రమంగా గుడ్ బై చెబుతూ స్వదేశీయాప్స్ వినియోగించుకోవాలని కేంద్రం డిసైడ్ అయింది. స్వదేశీ డిజిటల్ సాధనాలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. తన అధికారులందరినీ అధికారిక వ్యవహారాల కోసం జోహో ఆఫీస్ సూట్‌ను ఉపయోగించాలని ఆదేశించింది. ఇది స్వదేశీ డిజిటల్ స్వావలంబన వైపు ఒక ప్రధాన అడుగుగా పరిగణించడం జరుగుతుంది. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల జోహో మెసేజింగ్ యాప్ అరట్టైని ప్రశంసించిన తర్వాత ఈ ఆదేశం వచ్చింది. ఈ నిర్ణయం 'స్వావలంబన భారతదేశం' అనే ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పూర్తిగా క్లౌడ్ ఆధారిత వ్యాపార పరిష్కారాలను అందించే కొన్ని బ్రాండ్లలో భారతీయ టెక్నాలజీ కంపెనీ జోహో ఒకటి. ఈ కంపెనీ చిన్న స్టార్టప్‌ల నుండి పెద్ద సంస్థల వరకు అన్ని పరిమాణాల వ్యాపారాల కోసం సమగ్ర సాఫ్ట్‌వేర్ సూట్‌ను అభివృద్ధి చేసింది. జోహోలో అమ్మకాలు, మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, ఐటి నిర్వహణతో సహా విస్తృత శ్రేణి వ్యాపార విధులను కవర్ చేసే 55 కి పైగా ఇంటిగ్రేటెడ్ అప్లికేషన్‌లు రూపొందించారు. ఈ ప్లాట్‌ఫామ్ కంపెనీలు సంక్లిష్టమైన సెటప్ లేదా గణనీయమైన ఓవర్‌హెడ్ లేకుండా మొత్తం వర్క్‌ఫ్లోను డిజిటల్‌గా నిర్వహించడానికి అనుమతిస్తుంది. దాని సరసమైన ధర, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఆల్‌ఇన్‌వన్ ప్లాట్‌ఫామ్‌తో, జోహో.. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజాలకు నమ్మకమైన ప్రత్యామ్నాయంగా మారిపోయింది.

# గ్రూప్1 నియామకాలకు రైట్ రైట్

**స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ.. హైకోర్టు డివిజన్‌బెంచ్ విచారణే ఫైనల్**

**ఢిల్లీ, మహా :** తెలంగాణ గ్రూప్1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందించడంపై స్టే ఇవ్వాలని వారు కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా అభ్యర్థుల తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

**జోక్యానికి నిరాకరణ**

ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లు అన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలు అన్ రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని ధర్మాసనం సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించింది.

# ప్రధానిని నిలదీసే దమ్ములేదా?

**.. బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఫైర్**

**టెండర్లు పిలిచి ఎందుకు ఓపెన్ చేయడం లేదు?**



**హైదరాబాద్, మహా :** రీజినల్ రింగ్ రోడ్డు పనులపై మాటలే తప్ప ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని నిలదీసే దమ్ములేదని అన్నారు. నితిన్ గడ్కరీని కలిసి ఇగో అయిపోతుంది.. అగో అయిపోతుంది అంటారు కానీ అది అయిందిలేదు పోయిందిలేదని అన్నారు. రాష్ట్ర సాధన తరువాత కేసీఆర్ మదిలో నుండి పుట్టిన ప్రాజెక్ట్ ట్రిపుల్ ఆర్ గురించి 2015 నుండి కేంద్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ అడుగుతూనే ఉన్నారని అన్నారు. 2017లో సూత్రప్రాయంగా అంగీకరించారని.. 2018లో డీపీఆర్ పంపించడం జరిగిందని అన్నారు. అప్రూవ్ చేశాక మళ్లీ తిరకాసు పెట్టారని తెలిపారు. ల్యాండ్ సేకరణకు మళ్లీ మోకాలు అడ్డుపెట్టారని.. భూ సేకరణకు ముందే రెండు వేల కోట్లు ఇవ్వాలన్నారని ఆరోపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని.. ఒక్క ఎకరా భూ సేకరణ చేయలేదని అన్నారు. తాము తెచ్చిన రూ.3వేల కోట్లు ఎటుపోయాయని ప్రశ్నించారు. రైతులకు డబ్బులు ఇవ్వకుండా భూ సేకరణ ఎలా సాధ్యమని నిలదీశారు. నార్త్ సైడ్ రింగ్ రోడ్డుకు టెండర్లు పిలిచారని.. ఇప్పటికీ 3 సార్లు టెండర్లు ఓపెన్ చేయలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పాలన్నారు.



# హైకోర్టుకు తీన్మార్ మల్లన్న

- ఎన్నికల్లో గుర్తును కేటాయించాలని పిటిషన్
- మల్లన్న అభ్యర్థనను పరిశీలించాలని ఈసీకి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన పార్టీ గుర్తింపు, గుర్తుకు సంబంధించిన అభ్యర్థనను పరిశీలించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న మల్లన్నకు ఊరట లభించినట్లయింది. ఇటీవల తాను స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీకి గుర్తింపు నిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గుర్తును కేటాయించాలని కోరుతూ తీన్మార్ మల్లన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని, నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది.

# ఇందిరమ్మ ఇండ్లపై ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే ఆరా

- ఖర్గేను పరామర్శించిన మంత్రి పొంగులేటి
- విజయవంతంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు
- లబ్ధిదారులే నిర్మాణ కర్తలు - మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను మంత్రి పొంగులేటి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు, చెల్లింపులు లబ్ధిదారుల ఎంపిక విధానం, ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర అంశాలపై ఖర్గే మంత్రిని అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పేదలకు ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే సదుపాయాన్ని కల్పించింది. ఇండ్ల పథకాలలో కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఐదు లక్షల రూపాయిలతో నాలుగు వందల చదరపు అడుగులు తగ్గకుండా ఇండ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. రాష్ట్రంలో గడచిన పది సంవత్సరాలలో పేదలు ఆశించిన మేరకు ఇండ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లకు డిమాండ్ అధికంగా ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మొదటి దశలో ఈ ఏడాది 22,500 కోట్ల రూపాయిలతో నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని లబ్దిదారుల ఎంపిక పూర్తి కాగా దాదాపు 3 లక్షల 5 వేలకు పైగా ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు స్వయంగా హాజరయ్యారని వివరించారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా లబ్దిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం, పేదరికమే అర్హతగా ఇండ్లను మంజూరు చేస్తున్నాం. అడవులను నమ్ముకొని జీవించే చెంచులకు సైతం తొలిసారిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఇటీవల ఏర్పాటు చేశామని , కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపై 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరుతెన్నులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు సవివరంగా వివరించగా ఖర్గే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు బాగుందని ఇదే విధంగా ముందుకు సాగాలని మంత్రి పొంగులేటిని అభినందించారు.

# పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు దాఖలైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సహచర మంత్రి అన్న విజ్ఞత లేకుండా, ప్రజల్లో ఉన్నామనే ఆలోచన లేకుండా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి లక్ష్మణ్‌ను దూషించడం సరికాదని, దీనిని తాము ఖండిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తక్షణమో సుమోటోగా స్వీకరించి అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు కమిషన్ తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శిల దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

# నవీన్‌కు లైన్ క్లియర్

**సీఎం రేవంత్ మొగ్గు అటు వైపే...**

**జూబ్లిహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నేడో రేపో ప్రకటించే అవకాశం**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. మంగళవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో నవీన్ యాదవ్ వైపే సీఎం రేవంత్‌రెడ్డి మొగ్గు చూపించినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేస్‌లో నుంచి తప్పుకున్నట్లు బొంతు రామ్మోహన్ ప్రకటించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందని.. ఉప ఎన్నికలో పార్టీ గెలుపు కోసం పనిచేస్తానంటూ బొంతు రామ్మోహన్ తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో పార్టీ బలోపేతంపై సీఎం ఫోకస్ పెట్టారు. అధికారంలోకి వచ్చాక జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికను గెలుచుకున్న ఆ పార్టీ.. జూబ్లీహిల్స్‌లోనూ గెలుపే మంత్రంగా ముందుకెళ్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లు దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మంత్రులు గడ్డం వివేక్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నేతలు రంగంలోకి దిగి పని మొదలు పెట్టారు. బీసీ అభ్యర్థిని నిలబెట్టాలనే ఆలోచనతో పార్టీ నేతలు నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, పేర్లను పరిశీలించారు.. అయితే సీఎం రేవంత్ నవీన్ వైపే ఆసక్తి చూపించినట్లు తెలిసింది. స్థానికంగా పట్టు, సర్వేలు, సమీకరణలు అన్నీ పరిగణనలోకి తీసుకుని సీఎం మొగ్గు అటువైపే ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఢిల్లీకి కూడా పేరు పంపారని, నేడో రేపో అధికార ప్రకటన కూడా వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

# పవన్ సినిమాలో విలన్ ఆఫర్

- రూ.3 కోట్లు కూడా ఇస్తామన్నారు
- మాజీమంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**మహా:** పాలమ్మినా.. పూలమ్మినా' అంటూ ఒకే ఒక్క డైలాగ్ తో సోషల్ మీడియాలో బాగా ఫేమస్ అయిపోయారు బీఆర్ ఎస్ నేత, ఎమ్మెల్యే మల్లారెడ్డి. రాజకీయవేత్తగా ఆయన చెప్పే మాటలు, డైలాగులకు, ప్రసంగాలకు చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ఈ క్రేజ్ తోనే దర్శకుడు హరీష్ శంకర్ సినిమాలో పెట్టాలనుకున్నాడు. హరీష్ శంకర్ కు మల్లారెడ్డి టైమింగ్, మల్లారెడ్డి హావభావాలు విలన్ పాత్రకు సూటవుతాయని డిసైడ్ అయి డైరెక్ట్ గా అప్రోచ్ అయ్యారు. ఉస్తాద్ భగత్ సింగ్ లో పవన్ కల్యాణ్ విలన్ గా మొదట మల్లారెడ్డినే అనుకున్నారు. ఆ రోల్ కోసం మా కాలేజీకి వచ్చి ఒక గంటసేపు వెయిట్ చేశాడు. అంతేకాకుండా రూ.3 కోట్ల పారితోషికం కూడా ఆఫర్ చేశాడు. అయినా కూడా నేను ఆ విలన్ పాత్రను ఒప్పుకోలేదు. విలన్‌గా చేస్తే ఇంటర్వెల్‌దాకా నేను హీరోను కొడతా.. ఆ తర్వాత హీరో నన్ను కొడతాడు.. తిడతాడు' అంటూ మల్లారెడ్డి తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.

# ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు రూ.24 వేలు బాకీ

- ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి
- మెడలు వంచి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసుకుందాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**ఎల్లారెడ్డిపేట, మహా:** ఆటో డ్రైవర్లు ఎవరు కూడా ఆత్మస్థైర్యం కోల్పోవద్దు, ధైర్యంగా ఉండాలి, జీవితం విలువైంది. కష్టం వచ్చిన ఆటో డ్రైవర్ అన్నల వెంబటి మా పార్టీ ఉంటుంది అని కేటీఆర్ అన్నారు. వెంటనే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు బీమా సౌకర్యంతో పాటు, ఏడాదికి రూ. 12,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని అనేక హామీలు ఇచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. అయితే, ఆరు నెలలు గడిచినా ఒక్క ఆటో డ్రైవర్‌కు కూడా ఆర్థిక సాయం చేయలేదని విమర్శించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇక్కడ మాత్రం ఒక్కరికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సహాయం చేయలేకపోవడం దారుణమన్నారు. డ్రైవర్లకు ఇప్పటికే 24 నెలల బకాయి (ఒక్కో డ్రైవర్‌కు సుమారు రూ. 24,000 చొప్పున) బాకీ పడిందని ఆయన వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటలోని అశ్విని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సతీశ్‌ను పరామర్శించిన అనంతరం కేటీఆర్, ఆయన కుటుంబానికి రూ. 25,000 ఆర్థిక సహాయాన్ని వ్యక్తిగతంగా అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. ఆటో డ్రైవర్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన 93 మందికి పైగా ఆటో డ్రైవర్ల సమాచారాన్ని ప్రభుత్వానికి అందించినా, ఇప్పటివరకు స్పందించలేదన్నారు. తమ ప్రభుత్వం గతంలో రాష్ట్రంలోని డ్రైవింగ్ చేసే తెలంగాణ బిడ్డల కోసం తీసుకువచ్చిన ప్రమాద బీమాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తీసివేసిందని కేటీఆర్ ఆరోపించారు. దీని కారణంగా దాదాపు 8 నుండి 8.5 లక్షల మంది డ్రైవర్లకు బీమా సౌకర్యం లేకుండా పోయిందన్నారు. దాదాపు రూ. 2 లక్షల 30 వేల కోట్ల అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఒక ప్రాజెక్ట్ కట్టలేదు, రోడ్డు వేయలేదు, కొత్త సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదు, ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదు కానీ, ఈ డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ధైర్యం చెబుతూ, "ఆటో డ్రైవర్లు ఎవరు కూడా ఆత్మస్థైర్యం కోల్పోవద్దు, ధైర్యంగా ఉండాలి, జీవితం విలువైంది. కష్టం వచ్చిన ఆటో డ్రైవర్ అన్నల వెంబడ మా పార్టీ ఉంటుంది. తిరిగి మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ అన్న అందరిని ఆదుకుంటాం" అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ఆటో డ్రైవర్ సంఘాలన్ని, డ్రైవర్లందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేసిన ఆయన, ప్రభుత్వం మెడలు వంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసుకుందామని పిలుపునిచ్చారు.



# గ్రూప్ 1 అపాయింట్ మెంట్స్ క్యాన్సిల్ చేయండి

- మెయిన్స్ ఆన్సర్ షీట్లను తొందరపడి డిస్పోజ్ చేయొద్దు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** గ్రూప్ 1 అంశంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వీడియోను రిలీజ్ చేశారు. గ్రూప్ 1 నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలు తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేసినా... వారికి ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కులేదని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించిందని గుర్తుచేశారు. దీన్ని బట్టి చూస్తే గ్రూప్ 1 ప్రక్రియలో.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని తప్పులు చేసిందో సుప్రీంకోర్టు ఎత్తిచూపినట్లే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రూప్ 1 ఉద్యోగ నియామకాల వివాదం న్యాయ స్థానాల్లో తేలేవరకు అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను తొందరపడి డిస్పోజ్ చేయొద్దన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన వరకు అనేక తప్పులు చేసిందని, ముఖ్యంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను తుంగలో తొక్కిందని కవిత ఎద్దేవా చేశారు. న్యాయస్థానాలు తుది తీర్పు ఇచ్చేలోపు ప్రభుత్వం అభ్యర్థుల మెయిన్స్ ఆన్సర్ షీట్లను డిస్పోజ్ చేస్తే నిరుద్యోగులతో కలిసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను స్తంభింప చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి సర్కారుకు కవిత మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# వరి ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ టాప్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటిపారుదల విస్తరణతో రాష్ట్రం సాధించిన వృద్ధి ధాన్యం దిగుబడిలో తేలిపోయిందని, రాష్ట్ర వ్యాప్తంగా 67.57 లక్షల ఎకరాలలో జరిగిన వరి సాగులో 40.75 లక్షల ఎకరాలలో సన్నాలు, 26.82 లక్షల ఎకరాలలో దొడ్డు వడ్ల సాగు చేశారన్నారు. ఇందులో సన్నాలు 90.46 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 57.84 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి 148.30 లక్షల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఇంత పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి అరుదైన రికార్డుగా అభివర్ణించారు. ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని అరుదైన రికార్డు నెలకొల్పిన ఘనత తెలంగాణా రైతాంగానికి చెందుతుందన్నారు. అదే సమయంలో కొనుగోళ్లలోను రాష్ట్రం యావత్ భారత దేశానికి మార్గదర్శనంగా నిలుస్తోందని, 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. కనిష్ట మద్దతు ధర కింద కొనుగోలు మొత్తానికి రూ.21,112 కోట్ల అవుతున్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో నేరుగా రైతులకు చెల్లింపుల కింద రూ. 19,112 కోట్లు ఖర్చు కానున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం సబ్సిడీ నిమిత్తం చెల్లించాల్సిన రూ. 6,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ వ్యవసాయంలో అగ్రగామిగా తెలంగాణ

- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ తో చిన్న, సన్నకారుల రైతుల అనుసంధానం
- సాగు వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యం
- జర్మనీ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ




**హైదరాబాద్, మహా :** డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్నదే సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తమ సంకల్పమని వివరించారు. సాగులో నూతన ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. కృత్రిమ మేథ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ప్రతినిధుల బృందంతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంది. రాష్ట్ర జనాభాలో సుమారు 55 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు తన చేయూతను అందిస్తోంది. మరోవైపు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ కు రాష్ట్రం గ్లోబల్ హబ్ గా మారింది. ఇలాంటి తరుణంలో డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను ఆదర్శంగా నిలపాలని సంకల్పించాం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పైగా... సాగులో పురుగు మందుల వినియోగం పెరిగి పర్యావరణానికి ఎంతో హానీ జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పెట్టుబడి వ్యయం, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగానే మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది' అని వివరించారు. 'అత్యాధునిక సెన్సార్ల ద్వారా నేల స్వభావాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చు. ఫలితంగా రసాయనాల కొనుగోలు ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. సుస్థిరమైన, క్లైమేట్ రెసిలియెంట్ వ్యవసాయ పద్ధతులకు మార్గం సుగమం అవుతుంది' అని చెప్పారు. అనంతరం... రాష్ట్రంలో గత రెండేళ్లుగా వేములవాడ కు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' ఆధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్‌రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం (న్యూఢిల్లీ) ఫుడ్, అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్ హెచ్ ఐ ప్రతినిధులు డా.సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- గిమ్మ ,జందాపూర్ నుండి తరలి వచ్చిన గ్రామస్తులు
- బీఆర్ఎస్ కు చెందిన మాజీ యంపిటీసీతో పాటు పలువురి చేరిక
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో నిత్యం చేరికలు జరుగుతున్నాయి. తాజాగా మంగళవారం గిమ్మ సంతోష్ ఆధ్వర్యంలో మాజీ యంపీటీసీ అమ్ముల రమేష్ యాదవ్ తో పాటు మాజీ జడ్పీటీసీ కొండ గంగాదర్, చిల్కూరి సతీష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామం నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అంతా కలసి ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సెడ్మకే ఆనందరావు ,భూపెల్లి శ్రీధర్, శ్రవణ్ నాయక్, ఉయిక ఇందిరా, శ్రీలేఖ, కొండ గంగాధర్, గుడిపల్లి నగేష్, బండారి సతీష్ ,సందా నర్సింగ్, రామ్ కుమార్, దొగ్గలి రాజేశ్వర్,సుధాకర్ గౌడ్, దేవిదాస్ చారి, శాంతన్ రావు, పోరెడ్డి కిషన్, ఎంఏ షకిల్, బోనగిరి సంటెన్న,రమేష్, అశోక్, అతీఖ్ తదితరులు పాల్గొన్నారు'






## రత్నాకర్ అనే దొంగ వల్లనే వాల్మీకి ఋషిగా మారాడు

**మందమర్రి, మహా :** రత్నాకర్ అనే దొంగ వల్లనే వాల్మీకి ఋషిగా మారాడని సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ ఉద్ఘాటించారు. మంగళవారం స్థానిక జిఎం సమావేశ మందిరంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జిఎం మాట్లాడుతూ భారతీయ చంద్రమాన క్యాలెండర్‌లో అశ్విని మాసంలోని పౌర్ణమి రోజున వాల్మీకి జయంతి వేడుకలు ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుండి రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు కార్యాలయాలలో అధికారికంగా జరుపుకుంటున్నామని తెలిపారు. బోయ కులంలో పుట్టి భారత సంస్కృతి సాంప్రదాయాలను పట్టించి రామాయణం అనే మహాకావ్యాన్ని రచించిన మహా ఋషి వాల్మీకి అని కొనియాడారు. అంతకుముందు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కంది శ్రీనివాస రెడ్డి సమావేశం





**ఆదిలాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని అత్యధిక జడ్పీటీసీ, యంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలోని సమావేశమందిరంలో మండలాల ముఖ్యనాయకులు కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. సాత్నాల, ఆదిలాబాద్ రూరల్,మావల మండల నాయకుల తో భేటీలో పలు అంశాలపై చర్చించారు. పోటీకి సిద్దంగా ఉండే ఆశావహులు వారికి ఆయా ప్రాంతాలలో ఉన్న బలాబలాలపై సమీక్ష జరిపారు. జడ్పీటీసీ, యంపీటీసీ లలో ప్రతీ స్థానం నుండి కొందరి ఆశావహుల పేర్లు పరిశీలనలోకి తీసుకుని అధిష్టానం సూచనలతో తుది జాబితా ఖరారు చేస్తామన్నారు. గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులకు తప్పకుండా తదిజాబితాలో చోటు దక్కుందన్నారు. ఎవరికి టికెట్ లభించినా అంతా కలిసి స్థానిక ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ ,సెడ్మకే ఆనందరావు ,భూపెల్లి శ్రీధర్, శ్రవణ్ నాయక్, ఉయిక ఇందిరా, శ్రీలేఖ, కొండ గంగాధర్, గుడిపల్లి నగేష్, బండారి సతీష్ , సందా నర్సింగ్, రామ్ కుమార్, దొగ్గలి రాజేశ్వర్,సుధాకర్ గౌడ్, దేవిదాస్ చారి, శాంతన్ రావు, పోరెడ్డి కిషన్, ఎంఏ షకిల్, బోనగిరి సంటెన్న,రమేష్, అశోక్, అతీఖ్ నియోజకవర్గంలోని సాత్నాల, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలకు చెందిన ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్ ప్రొఫైల్ తో నకిలీ వాట్సాప్

**ఆదిలాబాద్ మహా :** నిర్మల్ జిల్లా కలెక్టర్ ప్రొఫైల్ తో నకిలీ వాట్సాప్ సందేశాలు రావడంతో జిల్లా అధికారులు అధికారులు అప్రమత్తమయ్యారు. ఫేక్ ఖాతాపై కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ప్రకటన జారీచేశారు. 66958518330 నంబరుతో తన ప్రొఫైల్ తో వచ్చే వాట్సాప్ నుంచే సందేశాలు, సూచనలు ఎవరూ నమ్మవద్దన్నారు. ఇలాంటి నకిలీ నంబర్ల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నంబర్ నుంచి ఎవరికైనా సందేశాలు వస్తే అధికారులకు తెలియజేయాలన్నారు. ఇప్పటికే ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

### ఈపీఎఫ్,ఈఎస్ఐలలో డబ్బులు జమ చేయని

## ఏజెన్సీ పై విచారణ చేపట్టాలి

**మంచిర్యాల, మహా :** ఈపీఎఫ్, ఈఎస్.ఐ లలో డబ్బులు జమ చేయని ఏజెన్సీ పై విచారణ చేపట్టాలని కోరుతూ మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవో కు సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ బృందం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పరిధిలోని (బిసి) ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లో ఔట్సోర్సింగ్ ద్వారా విధులు నిర్వహిస్తున్న వారికి గత 10 నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. ప్రతి నెల వర్కర్లకు జమ చేయాల్సిన ఈపీఎఫ్ ఈఎస్ఐ డబ్బులు ఏజెన్సీ నిర్వాహకులు జమ చేయడం లేదని ఆరోపించారు. ప్రతినెల జీతాలు ప్రభుత్వం చెల్లించిన తర్వాత ఏజెన్సీ నిర్వాహకులు ఈపీఎఫ్, ఈఎస్ఐ జమ చేయక పోవడంతో ఆ ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య, లక్ష్మి పద్మ, సత్తమ్మ, శాంత, దుర్గ నర్సింహులు, రాజన్న, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల మధ్య క్యాస్ట్ వార్

(మొదటిపేజీ తరువాయి)

అయితే ముందుగా పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి వచ్చారు. అడ్లూరి కోసం వెయిట్ చేస్తున్న సమయంలో పొన్నం ప్రభాకర్ మరో మంత్రి వివేక్ చెవిలో మనకు టైం అంటే తెలుసు.. జీవితం అంటే తెలుసు.. వాడికేం తెలుసు దున్నపోతు.. అంటూ అన్నారు. మంత్రి అడ్లూరిని ఉద్దేశించే పొన్నం ఈ వ్యాఖ్యలు చేశారన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. మాదిగ మంత్రిని పొన్నం ప్రభాకర్ అవమానించారన్న చర్చ కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. సహచర మంత్రిని అవమానించినా చూస్తూ ఉంటావా వివేక్ అని ప్రశ్నించారు. పొన్నం వ్యాఖ్యలపై మాదిగ ఎమ్మెల్యేలు స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి అన్నీ తెలుసని అనుకుంటున్నానన్నారు. పొన్నంకు 24 గంటలు డెడ్‌లైన్ విధిస్తున్నానన్నారు. ఈ లోగా వివరణ ఇవ్వకపోతే హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. సామాన్య కార్యకర్త మాతో సమానంగా కూర్చుంటడా.. వీడేంది అన్న భావన పొన్నంకు ఉందన్నారు. కేవలం తాను ఒక్కడినే ఉండాలన్నది పొన్నం కుట్ర అని అన్నారు. పొన్నం మాదిరిగా అహంకారంగా మాట్లాడటం తనకు రాదని అన్నారు. ఆయన తన తప్పు తెలుసుకుంటారని అనుకున్నానని ఇప్పటికీ మారకపోతే తర్వాత జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని అడ్లూరి వ్యాఖ్యానించారు. త్వరలోనే సోనియాగాంధీ, రాహుల్, ఖర్గే, మీనాక్షి నటరాజ్‌ను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ వెల్లడించారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అన్నారు. తాను మంత్రి కావడం మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు.

**మాదిగ మంత్రిని అవమానిస్తారా? మందకృష్ణ ఫైర్**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను మందకృష్ణ మాదిగ తీవ్రంగా ఖండించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మణ్‌ను పొన్నం దున్నపోతు అని సంబోధిస్తే మరో దళిత మంత్రి వివేక్ వెంకటస్వామి ఖండించకపోగా సమర్థించినట్లుగానే హావభావాలు ప్రదర్శించడంపై తీవ్రంగా మండిపడ్డారు. పొన్నం మాట్లాడిన తీరు మంచిది కాదన్నారు. దళితులు, బలహీనవర్గాల మధ్య ఈ వివాదం పెరగవద్దని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫోన్ చేశానని స్పష్టం చేశారు. ఈ మేరకు మందకృష్ణ మాట్లాడుతూ.. 'గొడవ త్వరగా పరిష్కారం కావాలని చూస్తున్నాం. పొన్నం ప్రభాకర్ చెప్పే క్షమాపణ మీదే ఆధారపడి ఉంది. కాబట్టి తక్షణమే పొన్నం క్షమాపణలు చెప్పాలి. లక్ష్మణ్ పరిధిలోని మైనార్టీ సంక్షేమశాఖ కార్యక్రమానికి అరగంట ముందుగా వెళ్లి అడ్లూరి రాలేదని ఎందుకు మాట్లాడారు? అసలు ఆ శాఖలో పొన్నం ప్రభాకర్, వివేక్ జోక్యం ఎందుకు? మీ శాఖల్లో ఇతరులు కోమటిరెడ్డి, పొంగులేటి జోక్యం చేసుకుంటే ఊరుకుంటారా? పొన్నం, వివేక్‌ను సీఎం పంపితే ఆయన కూడా తప్పు చేసినట్లే. తోటి దళితుడిని అలా అనకూడదని ఖండించాల్సిన వివేక్ వెంకట స్వామి అడ్లూరిని హేళన చేస్తారా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. రెడ్లు, బీసీ, మాలలను ఆహ్వానించిన వివేక్ వెంకటస్వామి మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌ను పిలవకపోవడం అంటే అర్థం ఏమిటని అడిగారు. తోటి మాల సోదరుడుడే తోటి మాదిగ మంత్రిని కనీసం ఆహ్వానించాలనే సోయి కూడా లేదంటే మాదిగలను అవమానించినట్లే కదా? అన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు ఉమ్మడి హక్కుల కోసం పోరాడాలంటూ మందకృష్ణ పిలుపునిచ్చారు.

**మరింత జటిలం చేయవద్దు- మహేశ్‌కుమార్ గౌడ్ సూచన**

మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య తలెత్తిన వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరగడం పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి స్పందించడంతో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ జోక్యం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ ఉదయం ఇద్దరితో ఫోన్‌లో మాట్లాడి వివాదాన్ని మరింత జటిలం చేయవద్దని సూచించినట్లు సమాచారం. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని ఒకరికొరు సహకరించుకోవాలని చెప్పినట్లుగా పీసీసీ వర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడిగా జోక్యం చేసుకోవడంతో ఇద్దరు మంత్రుల మధ్య చోటు చేసుకున్న వివాదానికి తెరపడుతుందని పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

**అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను : మంత్రి పొన్నం**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో మంత్రి స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు తనతో మాట్లాడారని, అదే ఫైనల్ అని వెల్లడించారు. రహమత్ నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించానని, అడ్లూరి వ్యాఖ్యలపై తాను స్పందించనని స్పష్టం చేశారు. పార్టీ పరంగా తమకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యమని అన్నారు.




## రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

### మంచిర్యాల జిల్లా బీఎస్పీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

**మందమర్రి, మహా :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మంచిర్యాల జిల్లా బహుజనులు సిద్ధంగా ఉండాలని మంచిర్యాల జిల్లా బీఎస్పీ అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మందమర్రి లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ వాదానికి బహుజన సమాజ్ పార్టీ నిలువెత్తు రూపమని అన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో పాల్గొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎన్నికల ప్రచారం కొరకు తన శక్తి మేరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తానని వెల్లడించారు. ప్రతి బీఎస్పీ కార్యకర్త, ప్రజా ప్రతినిధులు నిత్య ప్రజల కష్టనష్టాలను తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు జిల్లాలో చురుగ్గా పనిచేస్తూ ఏనుగు జెండాను ఎగురవేసే విధంగా సత్తా చాటాలని స్పష్టం చేశారు.

## కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఓట్ చోరీ సంతకాల సేకరణ



**ఆదిలాబాద్ మహా :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్న ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాలతో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనవాస రెడ్డి నేతృత్వంలో క్యాంపెయిన్ నిర్వహించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో బీజేపీ ఓట్ల చోరీపై సాత్నాల, ఆదిలాబాద్ రూరల్ , మావల మండలాల నాయకులు కార్యకర్తల నుండి పెద్ద ఎత్తున పత్రాలపై సంతకాలు సేకరించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎలక్షన్ కమీషన్ కుమ్మక్కై లక్షలాది కాంగ్రెస్ ఓట్లను తొలగించారని ఆరోపించారు. బీహార్, మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, చత్తీస్ ఘడ్ రాష్ట్రాలలో ఈ ఓట్ల చోరీ జరిగిందని దీనిపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని అధిష్టానం సూచనలతో ఓట్ చోరీ సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ , సెడ్మకే ఆనందరావు ,భూపెల్లి శ్రీధర్, ఉయిక ఇందిరా, శ్రీలేఖ, కొండ గంగాధర్, గుడిపల్లి నగేష్, బండారి సతీష్ , సందా నర్సింగ్, రామ్ కుమార్, దొగ్గలి రాజేశ్వర్,సుధాకర్ గౌడ్, దేవిదాస్ చారి, అల్చెట్టి నాగన్న,శాంతన్ రావు, పోరెడ్డి కిషన్, ఎంఏ షకిల్ సాత్నాల, ఆదిలాబాద్ రూరల్ , మావల మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## క్రీడల్లో విజయం సాధించాలంటే కృషి పట్టుదల అవసరం

### హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు చుంచు రాజు కిరణ్

**మంచిర్యాల, మహా :** క్రీడల్లో విజయం సాధించాలంటే క్రీడాకారులకు కృషి పట్టుదల అవసరమని మంచిర్యాల జిల్లా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు చుంచు రాజు కిరణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ లు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మోడల్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో అండర్ 19 కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని పేర్కొన్నారు. క్రీడల వల్ల ఉత్సాహం మానసిక ప్రశాంతత పెరుగుతుందని అన్నారు. అంతేకాకుండా క్రీడా లలో పాల్గొనడం ద్వారా వచ్చే క్రీడా ధ్రువపత్రాలు ఉద్యోగాల పోటీ సమయంలో కీలకంగా పనిచేస్తాయని వివరించారు. అనంతరం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దబ్బేట తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటాలని గెలుపోటములు దైవాదినమని స్పష్టం చేశారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పేరు తీసుకురావాలని అన్నారు.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై దాడిని ఖండిస్తున్నాం

### మంచిర్యాల అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఎస్పి నిరసన

**మంచిర్యాల, మహా :** సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై దాడిని బహుజన సమాజ్ పార్టీ ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లాఅధ్యక్షులుముల్కలరాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా ఐబి, అంబేద్కర్ చౌరస్తాలో బిఎస్పి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారత దేశ అత్యుత్తమ న్యాయమూర్తి సీజేఐ గవాయి పై దాడికి యత్నించడాన్ని తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. న్యాయమూర్తి దళితుడనే ఉద్దేశంతో అగ్రవర్ణాలు, ఆర్ఎస్ఎస్ మూకలు ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్రగా తాము భావిస్తున్నామని అనుమానం వ్యక్తం చేశారు.ఇలాంటి ఘటనలు మరోసారి పునారావృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈ



ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కాదశి రవీందర్, ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, బెల్లంపల్లి అధ్యక్షులు దాగం శ్రీనివాస్, బూడిద మల్లేష్, కుమ్మరి కృష్ణ చైతన్య, శంకర్, శెట్టి ప్రవళిక పాల్గొన్నారు.

## సమ్మక్కసారలమ్మ విశ్వవిద్యాలయం లోగో ఆవిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కోరినట్టు చెప్పారు. యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ధర్మేంద్ర ప్రధాన్‌కి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. 'వర్సిటీ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. తెలంగాణ సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వారికి కూడా ఈ యూనివర్సిటీ సేవలందిస్తుంది. స్థానిక ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త కోర్సులు తీసుకురావాలి. నూతన పరిశోధనలు, సృజనాత్మకతకు వేదికగా మార్చాలి. ఎంతో విలువైన భారతీయ ఆయుర్వేద విలువలు, గిరిజనుల ఆహారం గురించి కోర్సుల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలి. గిరిజన భాషల్లో కూడా పాఠ్యాంశ బోధన ఉండాల్సిన అవసరముంది. ములుగు పరిసర ప్రాంతాల్లో యువత క్రీడా నైపుణ్యం ఉంటుంది, వారు క్రీడల్లో రాణించేలా చొరవ తీసుకోవాలి. వర్సిటీ లోగో రూపకల్పనలో సృజనాత్మకత ఇమిడి ఉంది. పలు తెగల భాషలకు సంబంధించిన పదాలను లోగోలో వాడటం చాలా అద్భుతమైన నిర్ణయం' అని ధర్మేంద్రప్రధాన్ అన్నారు.

### తెలంగాణ టీడీపీ నేతలతో

## చంద్రబాబు భేటీ

(మొదటిపేజీ తరువాయి)

సుదీర్ఘ కాలం తర్వాత చంద్రబాబుతో తెలంగాణ తెలుగుదేశం నేతలు సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుని ఎంపిక, పార్టీ సంస్థాగత నిర్మాణంపై సమావేశంలో ప్రధానంగా మాట్లాడారు. ఇప్పటికే కసరత్తు పూర్తియిన నేపథ్యంలో తెలంగాణలో మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునితో పాటు స్టేట్ కమిటీ నియమించాలనే అంశంపైనా సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తెలంగాణలో 1.78 లక్షల సభ్యత్వం చేసినట్లు చంద్రబాబుకు నాయకులు వివరించారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కొమురంభీం వర్ధంతి

- భీం విగ్రహానికి శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన కంది శ్రీనివాస రెడ్డి
- పోరాట యోధుని సేవలను కొనియాడిన నేత

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం కొమురం భీం 85వ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ నాయకులు, ఇతర శ్రేణులతో కలిసి పట్టణంలోని కొమురంభీం చౌక్ వద్ద గల భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. జల్, జంగిల్ , జమీన్ నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. వారి హక్కుల సాధనలో ఆయన తన జీవితాన్ని సైతం త్యాగం చేసిన మహనీయుడన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురొడ్డి పోరాడి నిలిచిన ఆదివాసీ వీరుడన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం అందరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం భీం ఆశయాలకనుగుణంగా పని చేస్తూ ఎన్నో మంచి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సెడ్మకే ఆనందరావు ,భూపెల్లి శ్రీధర్, శ్రవణ్ నాయక్, ఉయిక ఇందిరా, శ్రీలేఖ, కొండ గంగాధర్, గుడిపల్లి నగేష్, బండారి సతీష్ , సందా నర్సింగ్, రామ్ కుమార్, దొగ్గలి రాజేశ్వర్,సుధాకర్ గౌడ్, దేవిదాస్ చారి, శాంతన్ రావు, పోరెడ్డి కిషన్, ఎంఏ షకిల్, బోనగిరి సంటెన్న,రమేష్, అశోక్, అతీఖ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇక కొమురం భీం జయంతి, వర్ధంతులు రాష్ట్ర పండగ

### జోడేఘాట్ కు హాజరైన జూపల్లి, అడ్లూరి

**ఆదిలాబాద్ మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరీ మండలంలో జోడేఘాట్ లో ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురం భీం 85వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ ,ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొమరం భీమ్ విగ్రహానికి పూల మాల వేసి, సమాధి వద్ద నివాళులార్పించారు. మంత్రులకు ఆదివాసీ సాంప్రదాయ ప్రకారం డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు.ఆదివాసీయుల కుల ధైవాలకు మొక్కులు చెల్లించి మ్యూజియంను సందర్శించారు.జల్ జంగల్ జమీన్ కోసం నిజాం సర్కారుతో పోరాడి వీరమరణం పొందిన ఆదివాసీయుల దైవం కొమరం భీమ్ నేటి యువతకు స్ఫూర్తి అని మంత్రులు అన్నారు.ఆయన దేశానికి గర్వకారణమని, గిరిజనుల ఆత్మగౌరవ ఉద్యమాలకు మార్గదర్శకుడని పేర్కొన్నారు..ఆనాటి నినాదమే ఇప్పటికి ఆదివాసుల మదిలో ఉందని అన్నారు.... పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప అన్నట్లు....తెలంగాణ రాష్ట్రం కూడా ఆనాటి భీమ్ స్ఫూర్తి తోనే మనం సాధించుకున్నామని అన్నారు..కొమరం భీమ్ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దర్బార్ ను రద్దు చేసారు.



## క్రీడల్లో విజయం సాధించాలంటే కృషి పట్టుదల అవసరం

- అండర్ 19 కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలి
- హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు చుంచు రాజు కిరణ్



**మంచిర్యాల, మహా :** క్రీడల్లో విజయం సాధించాలంటే క్రీడాకారులకు కృషి పట్టుదల అవసరమని మంచిర్యాల జిల్లా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు చుంచు రాజు కిరణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ లు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మోడల్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో అండర్ 19 కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని పేర్కొన్నారు. క్రీడల వల్ల ఉత్సాహం మానసిక ప్రశాంతత పెరుగుతుందని అన్నారు. అంతేకాకుండా క్రీడా లలో పాల్గొనడం ద్వారా వచ్చే క్రీడా ధ్రువపత్రాలు ఉద్యోగాల పోటీ సమయంలో కీలకంగా పనిచేస్తాయని వివరించారు. అనంతరం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దబ్బేట తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటాలని గెలుపోటములు దైవాదినమని స్పష్టం చేశారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అండర్ 19 కార్యదర్శి బాబురావు, అండర్ 14 కార్యదర్శి యాకూబ్, పిడి నేరెళ్ల సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# రాగిణిదాస్... తిరుగులేని స్ఫూర్తి

## ఉద్యోగానికి పనికిరావన్న వాళ్ళకే.. బాస్

## గూగుల్ ఇండియా స్టార్టప్ హెడ్ గా సెన్సేషన్










(మహా, ప్రత్యేకం)

రాగిణి దాస్.. ఇపుడు టెక్ ప్రపంచంలో ఓ సంచలన స్ఫూర్తిదాయక మహిళ. ఒకపుడు ఆమెను ఉద్యోగానికి తిరస్కరించిన సంస్థే ఇపుడు పిలిచి మరీ ఇండియాకు బాస్ చేసింది. ఉద్యోగానికి వద్దన్నవారికే బాస్ గా మారితే ఆ కిక్కే వేరప్పా అంటోంది. ఇదంతా కేవలం రెండేళ్ళలోనే జరిగింది. టెక్ ప్రపంచంలోనే రాగిణి సాధించిన విజయం స్ఫూర్తిగా నిలుస్తోంది. మహిళాకేంద్రీకృత ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లీప్.క్లబ్ సహ వ్యవస్థాపకురాలు, ఫిక్కీలో ఉమెన్ ఇన్ స్టార్టప్స్ కమిటీ చైర్‌పర్సన్ రాగిణి దాస్ ఇపుడు గూగుల్ ఇండియాలో స్టార్టప్ హెడ్‌గా ఎంపికైంది. 2013లో గూగుల్ ఉద్యోగానికి సంబంధించి చివరి ఇంటర్వ్యూ రౌండ్‌లో ఎంపిక కాలేక పోయింది. కట్ చేస్తే లీప్.క్లబ్ సహ వ్యవస్థాపకురాలిగా జొమాటో వంటి సంస్థలతో కూడా పనిచేసిన అనుభవంతో గూగుల్ ఇండియా స్టార్టప్ హెడ్‌గా నియమితులైంది. దీనిపై ఆమె చేసిన ట్వీట్ వైరల్ గా మారింది.. నిజంగా జీవితం చక్రం లాంటిది.. తిరిగి అవకాశం వచ్చింది అంటూ ట్వీట్ చేసింది. గూగుల్‌లో తన కొత్త బాద్యతలను గురించి వ్యాఖ్యానిస్తూ ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లను సమర్థులైన వ్యక్తులు, ఉత్పత్తులు, ఉత్తమ పద్ధతులతో అనుసంధానించడం ద్వారా వాటిని అభివృద్ధి చేయడంలో సహాయపడే లక్ష్యంతో ఉన్నట్లు ప్రకటించింది.

### ఇదీ రాగిణీదాస్ ప్రొఫైల్

గురుగ్రామ్‌లో జన్మించిన రాగిణి దాస్, చెన్నైలోని చెట్టినాడ్ విద్యాశ్రమంలో పాఠశాల విద్యను పూర్తి చేసింది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందింది. అందుకు ముందు సాంస్కృతిక కార్యదర్శిగా కూడా పనిచేసింది. అలాగే గ్రాడ్యుయేషన్ సమయంలో, ఆమె స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ , ఇతర సంస్థలతో ఇంటర్న్‌గా, మార్కెట్ పరిశోధన మరియు భారత మార్కెట్ కోసం వ్యాపార ప్రణాళికలను డెవలప్ చేసింది. 2012లో, దేశీయ మార్కెటింగ్ కోసం ఫ్రంట్‌లైన్ వ్యవస్థాపకురాలిగా ట్రైడెంట్ గ్రూప్ ఇండియాలో చేరింది. అనంతరం యూరప్ అండ్ యుఎస్ మార్కెటింగ్ నిర్వహణలో పదోన్నతి పొందింది. తిరిగి ఒక్క ఏడాదిలోనే 2013లో, జొమాటోలో రాగిణి సేల్స్ అండ్ మార్కెటింగ్ మేనేజర్‌గా చేరింది. అకౌంట్ మేనేజర్, ఏరియా సేల్స్ మేనేజర్‌తో సహా వివిధ పాత్రల్లో ఆరేళ్లు తన సేవలను అందించింది. 2017లో, ఆమె జోమాటో గోల్డ్ వ్యవస్థాపక బృందంలో భాగమైంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఖతార్ మరియు లెబనాన్‌తో సహా 10 అంతర్జాతీయ మార్కెట్లలో జోమాటో గోల్డ్‌ను ప్రారంభించడంలో కీలక పాత్ర పోషించింది. 2020లో, వేలాది మంది మహిళల కోసం ఆన్‌లైన్ యాప్ మరియు ఆఫ్‌లైన్ క్లబ్‌ను లీప్.క్లబ్ ను సహస్థాపించింది వేలాది మంది మహిళలకు నెట్‌వర్కింగ్, ప్రొఫెషనల్ అవకాశాలు, క్యూరేటెడ్ ఈవెంట్‌లు ,ఆసక్తిఆధారిత కమ్యూనిటీలను అందిచింది. ఈ ఏడాది జూన్‌లో ఈ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేసింది. ప్రస్తుతం రాగిణి దాస్, గూగుల్ ఫర్ స్టార్టప్స్ భారతదేశ విభాగానికి కొత్త హెడ్‌గా ఎంపికైంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన **చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# మళ్ళీ హైదరాబాద్ రియల్ రైజింగ్

(మహా డెస్క్)

హైదరాబాద్ రియల్ మార్కెట్ కు రాయదుర్గం వేలం బూస్ట్ నిచ్చింది. గతంలో కోకాపేటలో ఎకరా వంద కోట్లకు అమ్ముడైన వ్యవహారం సంచలనమై.. మొత్తం మార్కెట్ పై ప్రభావం చూపింది. ఇపుడు రాయదుర్గం వేలంలో ఎకరా 177కోట్లకు ఆల్ టైం హై రేట్ కు కొనుగోలు చేసి ఎంఎస్ ఎన్ రియాల్టీ సంచలనం కాగా, బంగారం లాంటి హైదరాబాద్ మార్కెట్ మెరుపు తగ్గ లేదని ఈ సంఘటన నిరూపించింది. భారీ వేలంతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరోసారి దేశ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. సిటీలోని ప్రతిష్ఠాత్మక ఐటీ జోన్‌గా మారిన రాయదుర్గంలో జరిగిన భూ వేలం చరిత్ర సృష్టించింది. రేవంత్ సర్కార్ కు ఇది పెద్ద శుభ వార్త. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ వేలంలో ఎకరా భూమికి రూ.177 కోట్ల గరిష్ఠ ధర పలకడం ద్వారా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ వేలంలోనూ నమోదుకాని రికార్డు స్థిరపడింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి మధ్య వ్యూహాత్మకంగా ఉన్న ఈ రాయదుర్గం భూభాగం పెట్టుబడిదారులకు అత్యంత ప్రాధాన్యతగల ప్రదేశంగా మారింది. మియాపూర్ మెట్రో, ఔటర్ రింగ్ రోడ్ , అంతర్జాతీయ విమానాశ్రయానికి సులభ అనుసంధానం ఉండటంతో పాటు ఐటీ, కమర్షియల్, లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ రంగాలకు ఈ ప్రాంతం ఎంతో అనుకూలంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. కొత్త ధర గత రికార్డుతో పోలిస్తే దాదాపు 75 శాతం పెరుగుదల సాధించింది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం రాయదుర్గం, గచ్చిబౌలి, కోకాపేట వంటి ప్రాంతాలు భవిష్యత్‌లో దేశంలోని ప్రధాన ఐటీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ టెక్ హబ్‌లుగా రూపుదిద్దుకునే అవకాశముంది. తాజా రికార్డు ధరలు హైదరాబాద్ మార్కెట్‌పై పెట్టుబడిదారుల నమ్మకాన్ని మరింత బలపరిచాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మొత్తం మార్కెట్ లో స్తబ్దతను ఈ విక్రయాలు తొలగిస్తాయన్న అంచనాలు ఏర్పడుతున్నాయి.

### ఖజానాకు ఒకేసారి రూ.3,135 కోట్లు

ఈ-వేలంలో మొత్తం 18.67 ఎకరాల భూమి అమ్ముడైంది. ఇందులో సర్వే నంబర్ 83/1లోని ప్లాట్ నంబర్ 15A2లో ఉన్న 7.67 ఎకరాల భూమిని ఎంఎస్ఎన్ గ్రూప్ ఎకరాకు రూ.177 కోట్ల చొప్పున కొనుగోలు చేసింది. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.1,357.59 కోట్ల ఆదాయం లభించింది. అదే సర్వే నంబరులోని మిగిలిన 11 ఎకరాలను ప్రెస్టేజ్ రియాలిటీ సంస్థ ఒక్కో ఎకరాకు రూ.141.5 కోట్లకు సొంతం చేసుకుంది. ఈ భూవేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.1,556.5 కోట్లు వచ్చాయి. మొత్తం 18.67 ఎకరాల భూమి, స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులతో కలిపి రాష్ట్ర ఖజానాకు రూ.3,135 కోట్ల భారీ ఆదాయం సమకూరనుంది. "ఈ వేలం ద్వారా హైదరాబాద్లోని రియల్ ఎస్టేట్ మార్కెట్ కొత్త మైలురాయిని చేరింది. 2022లో కోకాపేట నియోపోలిస్‌లో ఎకరాకు రూ.100.75 కోట్లు పలికిన రికార్డు ఈసారి రాయదుర్గం నాలెడ్జ్ సిటీ భూములు అధిగమించాయి," అని టీఎస్ఐఐసీ ఎండీ ఎ. శశాంక అన్నారు.



## ఈవీఎం గోదాములను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వరంగల్, మహా;** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ఈవీఎం గోదాములను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణ గురించిన వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ నీట మునిగింది

**రాత్రి నుంచి పలు కాలనీలకు పవర్ కట్ అంధకారంలో కాలనీలు**
**ప్రతి సంవత్సరం కరెంటు కష్టాలు తప్పవు**



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ నీటిలో మునిగిపోయింది. కాటేదాన్ ఇండస్ట్రీతో పాటు పలు బస్తీలు, కాలనీలకు సోమవారం అర్ధ రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాలనీ వాసులు కరెంటు లేక చీకటిలో బిక్కు బిక్కు మంటూ గడిపారు. ప్రతి సంవత్సరం విద్యుత్ సబ్స్టేషన్ మునిగిపోవడం రాత్రంతా చీకట్లో గడపడం షరా మామూలైయింది. కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ విద్యుత్ అధికారులు విద్యుత్ కోసం ప్రజలు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడం విద్యుత్ అధికారుల పనితీరుకు నిదర్శనం. మంగళవారం హైడ్రా అధికారులు మునిగిన సబ్ స్టేషన్ నుంచి రెండు జనరేటర్ పంపుల సహాయంతో వరద నీటిని తొలగిస్తున్నారు. ప్రతి సారి వర్షాకాలం నేపథ్యంలో ఈ తంతు కొనసాగుతూనే ఉందని స్థానికులు మండిపడుతున్నారు.

## సీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేత

- రూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్
- వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**హన్మకొండ మహా;** నిషేధిత సి.పి.ఐ మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి,నార్త్ బస్తర్,డివిజనల్ కమిటీ సభ్యుడు,దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన మంద రూబెన్,@కన్నన్న@మంగన్న@సురేష్(67) వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎదుట మంగళవారం లొంగిపోయాడు. ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడిస్తూ హన్మకొండ జిల్లా,హసన్ పర్తి మండలం,వంగపాడు గ్రామానికి చెందిన మంద రూబెన్,@కన్నన్న@మంగన్న@సురేష్ 1979 సంవత్సరంలో కాజీపేటలోని ఆర్. ఈ.సిలో హాస్టల్ మెస్ విభాగంలో పనిచేస్తున్న సమయంలో రాడికల్స్ యూనియన్స్ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, ఒకప్పటి ఆర్. ఈ.సి పూర్వ విద్యార్థి నంబల కేశవరావు పిలుపు నందుకొని మావోయిస్టు పార్టీ లో చేరి అజ్ఞాతంలోని వెళ్ళిపోయాడు. 1981సంవత్సరం నుండి 1986 వరకు నేషనల్ పార్క్ దళ కమాండర్ లంక పాపిరెడ్డి నాయకత్వం దళ సభ్యుడిగా కుంట, బస్తర్ ప్రాంతాల్లో పనిచేసాడు. 1987లో మావోయిస్టు పార్టీ నాయకత్వం రూబెన్ ను ఏరియా కమిటీ సభ్యుడిగా అప్పగించడం జరిగింది. 1991లో అనారోగ్యం కారణంగా చికిత్స కోసం కొత్తగూడెం కు వెళుతున్న సమయంలో చత్తీస్గఢ్ పోలీసులు అరెస్ట్ చేసి జగదల్పూర్ జైలు తరలించగా,ఒక సంవత్సరం అనంతరం రూబెన్ మరో ముగ్గురు ఖైదీలతో కలసి జైలు నుండి తప్పించుకున్నాడు. 1992 లో జైలు తప్పించుకున్న రూబెన్ తిరిగి మావోయిస్టు పార్టీ లో కలిసి ఏరియా కమిటీ సభ్యుడిగా కుంట, అబుజ్ మడ్ ప్రాంతాల్లో 1999 వరకు పనిచేసాడు. ఇదే సంవత్సరంలో సెంట్రల్ కమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్ @రామన్న గోపన్న నేతృత్వంలో బీజాపూర్ జిల్లా, గుండ్రాయి గ్రామానికి చెందిన పొడియం భీమే తో రూబెన్ కు వివాహం జరిపించారు. 2005 సంవత్సరం డివిజన్ కమిటీ సభ్యుడి పనిచేస్తున్న సమయంలో అనారోగ్య కారణంగా పార్టీ ఆదేశాలతో రూబెన్ గుండ్రాయి గ్రామంలోనే భార్య, పిల్లలతో నివాసం వుంటూ,కోళ్లు, గొర్రెల ఫారాలు నిర్వహిస్తూనే స్థానిక గ్రామ కమిటీలతో కలసి చురుకుగా పని చేసే వాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ నాయకులకు తో పాటు దళ సభ్యులకు షెల్టర్, భోజన వసతులు కల్పిస్తూనే పోలీసుల కదలికలను గమనిస్తూ మావోయిస్టులకు సమాచారం అందిస్తూ మావోయిస్టు పని చేసేవాడు. అనారోగ్యం బాధపడుతున్న రూబెన్, ఉద్యమంలో పాల్గొనడం లో శరీరం సహకరించక పోవడం ముఖ్యంగా మావోయిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిపోవడం, ప్రజలకు మావోయిస్టుల పై వ్యతిరేకత రావడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాల ద్వారా ప్రశాంతవంతమైన వాతావరణంలో తన కుటుంబ సభ్యులతో జీవించాలని, నిర్ణయించుకొని మంగళవారం పోలీసుల ఎదుట రూబెన్ లొంగిపోవడం జరిగిందని సీపీ తెలిపారు. నిందితుడురూబెన్ పై 8లక్షల రూపాయల రివార్డ్ వుందని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

## ఎన్నికల కౌంటింగ్ కేంద్ర ఏర్పాట్లు పరిశీలన

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, మహా;** స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్ర ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్తు సీఈఓ రామిరెడ్డి లతో కలసి ఏనుమామూలుగా మార్కెట్ యార్డులో వరంగల్ జిల్లాలోని 11 మండలాలకు సంబందించిన జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను, క్షేత్రస్థాయిలో పరిశీలించి పటిష్టంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ లోని గోడౌన్ నెంబర్ 17ఏ, 17బి, 17సి, 17డి గదులను కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లకు గాను గదుల విస్తీర్ణాన్ని పరిశీలించారు. పోలింగ్ అనంతరం జిల్లాలోని 11 మండలాల బ్యాలెట్ బాక్స్ లను భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లు పక్కపక్కనే ఉండేలా చూడాలన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో మండలానికి సుమారుగా 14 టేబుళ్లు చొప్పున 11 మండలాలకు కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని, ఏ విధంగా అమరిస్తే సౌకర్యంగా ఉంటుందో పక్కా ప్రణాళిక చేయాలన్నారు. కౌంటింగ్ లలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను అధికారులు సమీక్షించుకోవాలని, కౌంటింగ్ కొరకు కౌంటింగ్ సిబ్బంది, ఎజెంట్స్, ప్రవేశం, బయటకు వెళ్లేదారి వేర్వేరుగా బ్యారిగేట్లతో ఉండాలని, అదే విదంగా ఎన్నికల భద్రత, విద్యుత్, వి.ఐ.పి పార్కింగ్, పోలింగ్ ఏజెంట్లుకు కావాల్సిన నీటి, టాయిలెట్స్ సౌకర్యం, పార్కింగ్ లలో ఏటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, హౌసింగ్ పిడి గణపతి,తహసీల్దార్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా లోని వర్ధన్నపేటలో అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించిన ఓటు చోరీ వ్యతిరేక ర్యాలీ లో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో కలిసి లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో నెగ్గేందుకు బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపర్చే ఈ చర్యలకు వ్యతిరేకంగా మనమందరం ధిక్కార స్వరం ఎత్తాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడి ప్రాథమిక ఓటు హక్కును బీజేపీ కాలరాస్తోంది. ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేస్తున్న బీజేపీ చేస్తున్న కుట్రల పట్ల ప్రతి ఒక్కరూ మేల్కొని ప్రతిఘటించాలి అన్నారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి నిజమైన రక్షణ కేవలం కాంగ్రెస్ పార్టీ వలననే సాధ్యం అని వారు స్పష్టం చేశారు. ర్యాలీ అంబేద్కర్ సర్కిల్ వరకు భారీగా కొనసాగగా, స్థానిక ప్రజలు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**గండిపేట, మహా:** ఆది కవి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం గండిపేట మండలం నార్సింగి పురపాలక సంఘం కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణ గ్రంథాన్ని రాసిన మహా కవి అని అన్నారు. హిందూ ధర్మం యొక్క గొప్ప తనాన్ని నలుదిశలా తెలిసేలా రామాయణ గ్రంథాన్ని రచించారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని వారి బాటలోనే నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మున్సిపల్ కమిషనర్లు నాగేంద్ర బాబు గారు డి ఈ నరేష్ గారు మేనేజర్ శ్రీనివాస్ గారు ఏ ఈ శ్రీనివాస్ గారు జేఏవో కృష్ణయ్య గారు, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి ఖండిస్తున్నాం

**బీఎస్పీ నేత, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్**



**షాద్ నగర్, మహా:** దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పై జరిగిన దాడిని బీఎస్పీ నేత రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ ఖండించారు, ఇది స్వతంత్ర న్యాయవ్యవస్థ పై దాడిగా ఆయన అభివర్ణించారు, విదేశీయుల దండయాత్రలో ఒక విగ్రహం తల విరిగితే, దానిని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి ఆధీనంలో ఉన్నందున మీరు అక్కడ వెళ్లి కలవండని ప్రధాన న్యాయమూర్తి గారు చేసిన సూచనలను తప్పుగా ప్రచురిస్తూ సోషల్ మీడియాలో కొంతమంది కుహన మేధావులు సనాతన ధర్మాన్ని కించపరిచినట్టుగా తప్పుడు విషయాలని ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, ద్వేషంతో పరిపాలన చేసే మీరు , దేశాన్ని అభివృద్ధి చేయలేరని, అది మీ చేతగానితనానికి నిదర్శనం అని తెలిపారు, పేద వర్గాల వ్యక్తులు అత్యున్నత స్థానాలలో ఉన్నందుకు కొంతమందికి మింగుడు పడటం లేదని, ప్రధాన న్యాయమూర్తి దాడి వెనుక ఇతరుల హస్తం ఉంటుందని అనుమానం మాకు ఉందని ఆయన తెలిపారు, ఇలాంటి సంఘటనల వాళ్ళని ప్రపంచ దేశాల ముందు భారతదేశ పరువు తీస్తున్నారని దుయ్యబట్టారు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాకేష్ కిషోర్ అనే న్యాయవాదిని దేశంలోని కోర్టులలో ప్రాక్టీస్ చేయకుండా నిషేధిస్తూ ఆయనను సస్పెండ్ చేయడం శుభపరిణామం అని తెలిపారు.

## రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృషి

**10 కోట్లతో సీసీ రోడ్లకు నిధులు మంజూరు**



**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేసిన కృషి ఫలించింది. రాజేంద్రనగర్ సర్కిల్ 11లో సీసీ రోడ్ల పనులకు చార్మినార్ జోనల్ కమిషనర్ కు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభ్యర్థన మేరకు, మైలార్‌దేవపల్లి (వార్డు59) రాజేంద్రనగర్ (వార్డు61) డివిజన్లతో సహా పలు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ అడ్మినిస్ట్రేట్ న్స నిధులు మంజూరు చేసింది. మైలార్‌దేవపల్లి, రాజేంద్రనగర్ మరియు అత్తాపూర్ డివిజన్లలో రోడ్ల అభివృద్ధి నిధులు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో రోడ్ల దుస్థితి. ముఖ్యంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీసీ రోడ్లు అత్యవసరం. ప్రజల తరపున నేను చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని,10 కోట్ల రూపాయలను త్వరితగతిన ఆమోదం తెలిపిన చార్మినార్ జోనల్ కమిషనర్ కి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందిస్తామని హామీఇచ్చారు. ఈ అభివృద్ధి పనులు టెండర్ ప్రక్రియ ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ అధికారును ఆదేశించారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



**పాల్గొన్న ట్రాఫిక్ ఏసిపి, ఇన్స్పెక్టర్**


**వరంగల్ హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని వెంకటేశ్వర గార్డెన్ లో ప్రత్యేకంగా ఆటో డ్రైవర్లకు మంగళవారం నిర్వహించిన ట్రాఫిక్ నిబంధనల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్వహించిన వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు మద్యం తాగి ఆటో నడపరాదని సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, ఆటోలకు తప్పనిసరిగా ముందు వెనుక నెంబర్ ప్లేట్ ఉండాలని ఫ్యాన్సీ నెంబర్ ప్లేట్లు వాడకూడదని తెలిపారు. అంతేకాకుండా ఆటో డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు యూనిఫామ్ తప్పక ధరించాలని నిర్ణీత వేగంతో మాత్రమే ఆటో నడపాలని, రాంగ్ సైడ్ డ్రైవ్ అస్సలు చేయకూడదని డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వరంగల్ ట్రాఫిక్ పోలీసులు, కోడూరి సుజాత, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో దాదాపు 300 మందికి పైగా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



**గండిపేట, మహా: బుధవారం తమ ఇంట్లో జరిగే వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని గండిపేట మండలం కోకాపేటకు చెందిన పి.సి.సి అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి మరియు ఓం ప్రకాష్ రెడ్డి, మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభలేఖ ను అందించి ఆహ్వానించారు.**

## నిదానంగా ఆన్‌లైన్ సర్వర్ నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

**కార్యాలయంలోనే కూర్చున్న క్రయవిక్రయదారులు**
**రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ టైం ముగిస్తే మళ్లీ స్లాట్ బుక్ చేయాల్సిందే**



**షాద్ నగర్, మహా:** నిత్యం రిజిస్ట్రేషన్ లతో బిజీగా ఉండే షాద్ నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిదానంగా ఆన్లైన్ సర్వర్ వస్తుండడంతో రిజిస్ట్రేషన్లు కాస్త నిలిచిపోయాయి. ఉదయాన్నే రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయవిక్రయదారులు ఆన్లైన్ సర్వర్ నిదానంగా వస్తుండడంతో కార్యాలయంలోని కూర్చున్నారు. ఇదిలా ఉంటే రిజిస్ట్రేషన్ సంబంధించి స్లాట్ బుకింగ్ టైం ముగిస్తే మళ్లీ స్లాట్ బుక్ చేస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని, ఇలా ఆన్లైన్ సర్వర్ నిదానంగా వస్తే మా రిజిస్ట్రేషన్లు ఎప్పుడు అవుతాయని క్రయవిక్రయదారులు వాపోతున్నారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**మొయినాబాద్, మహా:** ఉద్యోగరిత్య పదవీ విరమణ సహజమేనని ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గొప్పదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన ఎస్.వెంకటయ్య పదవీ విరమణ అభినందన సభను పిజిఆర్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పుల్లం దామోదర్ రెడ్డిలు మాట్లాడుతూ.. 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వెంకటయ్య చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిలో మంచిపేరు తేవడం ఆయన వ్యక్తిత్వం అన్నారు. ఉద్యోగ రిత్యా పదవీ విరమణ తప్పదని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో పదోన్నతులు త్వరలో జరగబోతున్నాయన్నారు. ఈహెచ్ఎస్ ద్వారా ఉపాధ్యాయులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరాపార్కు వద్ద ఓపీఎస్ సాధనకు పీఆర్టీయూ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నమంగళారం మాజీ సర్పంచ్ బాలమణిరాములు, పూలగుళ్ల గోపాల్ రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మల్లేష్, ఎం.ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గిరిధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎస్టియూ రాష్ట్ర అధ్యక్షులు సదానంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్య, సామాల మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్, జగన్మోహన్ గుప్తా, గోవర్ధన్ యాదవ్, నారాయణగౌడ్, మండల విద్యాధికారి మల్లయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్షులు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు హమీద్, లక్ష్మణ్, సత్యనారాయణ, రాములు, శివకుమార్, విజయాబాయ్, నరేందర్, వేణుగోపాల్, హైమావతి, శ్రీలత, నారాయణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు సిజెఐ పై బూటు విసిరిన వ్యక్తిని వెంటనే కఠినంగా శిక్షించాలి

**సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్**




**మొయినాబాద్, మహా :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై న్యాయవాది మతోన్మాది రాకేష్ కిషోర్ బూటు విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిజెఐ బిఆర్ గవాయ్, మరో న్యాయమూర్తి జస్టిస్ కె వినోద్ చంద్రన్ తో కూడిన ధర్మాసనం ఒ కేసు విచారిస్తున్న సమయంలో డయాస్ వద్దకు వచ్చిన న్యాయవాది రాకేష్ కిషోర్ తన స్పోర్ట్స్ షూస్ సిజేఐపై విసరడం మతోన్మాదానికి పరాకాష్ట అని అన్నారు. ఆ న్యాయవాదిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు గదిలో సీజేఐపై ఇలా బూటు విసరడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషించడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. దేశ ప్రజలంతా ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ అధ్యక్షుడు మహేందర్, షాన్, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు నడపరాదు

**ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం**



**ఆమనగల్లు, మహా :** మైనర్ బాల బాలికలు వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ట్రాఫిక్ ఎసిపి నాగభూషణం అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని సైబరాబాద్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన మరియు ట్రాఫిక్ విధులలో భాగస్వామ్యం పై జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ చట్టాలపై షాద్నగర్ ట్రాఫిక్ సిఐచంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎసిపి నాగభూషణం మాట్లాడుతూ.. బాలబాలికలకు వాహనాలు ఇవ్వొద్దని, మైనర్లు ట్రాఫిక్ ఆయన తల్లి దండ్రులు మైనర్ చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. వాహనదారులకు జరిమానాలు విధించడం మా అభిమతం కాదని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై పైనులు విధిస్తామన్నారు. స్పీడ్ లేజర్ గన్, డ్రంక్ అండ్ డ్రైవ్ మిషన్ పని తీరును విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల భారీ నుండి తప్పించుకోవచ్చని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినా, సిగ్నల్ జంప్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌ల కారణంగా ఇతర వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిన వారవుతార న్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి వాహన యజమానులు చిక్కులు కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు.కడ్తాల్ జంక్షన్లో విద్యార్థులకు ట్రాఫిక్ విధులపై సిగ్నల్స్ ప్రాక్టీస్ చేపించి ట్రాఫిక్ ని ఎలా ఆపాలి, తర్వాత జీబ్రా క్రాసింగ్ మీద పాదాచార్యులు వెళ్తున్నప్పుడు వాహనాలు నిల్పటం అదేవిధంగా విహెచ్ఎఫ్ సెట్ వాడకం వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలను పై ట్యాబ్ ద్వారా ఫోటో తీసి చలాన్ జనరేట్ చేయటం లాంటి విషయాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ బోర్డు సమావేశంలో పాల్గొన్న మేయర్ కమీషనర్

**దృశ్య మాధ్యమం ద్వారా సమావేశ నిర్వహణ**




**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీ డబ్ల్యు ఎస్ సి సి ఎల్)చైర్మన్ డా.టి.కె శ్రీదేవి అధ్యక్షతన 29 వ స్మార్ట్ సిటీ బోర్డు సమావేశం మంగళ వారం హైదరాబాద్ నుండి వర్చువల్ గా జరిగింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ ల నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ డబ్ల్యు ఎస్ సి సి ఎల్ చైర్మన్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులకు సంబంధించి బోర్డులో అప్రూవల్ తీసుకున్న ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు అనుమతులు పొందడం జరిగిందని పూర్తి ఐన ప్రాజెక్ట్ లు బిల్లుల మంజూరు కోసం అక్టోబర్ వరకు గడువు పొడిగించడం జరిగిందని, కొనసాగుతున్న ప్రాజెక్ట్ పనులను డిసెంబర్ లోగా పూర్తి చేయాలని ఈ సందర్భం గా చైర్మెన్ సూచించారు. ఈ కార్యక్రమం లో వర్చువల్ గా స్మార్ట్ సిటీ బోర్డు సభ్యులు ఈ ఎన్ సి భాస్కర్ రెడ్డి ,టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి , హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి సి డి ఏం. ఏ డైరెక్టర్ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై మండలాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్

**నామినేషన్ల స్వీకరణ,చెక్పోస్ట్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**



**వరంగల్ మహా;** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, రాయపర్తి మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సామాగ్రి, రిటర్నింగ్, సహాయ అధికారి స్వీకరణ గదులను, జనరల్ అబ్జార్వర్, వ్యయ పరిశీలకుల గదులు, ఎన్నికల సిబ్బంది, తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరగాలని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి తీసుకోవలసిన భద్రతా చర్యలు, పాటించాల్సిన విధానాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై సమీక్షించారు. ఏలాంటి పొరపాట్లు, ఆలస్యం లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరగాలని, భద్రతాపరంగా పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలన్నారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ర్యాంపులు, దివ్యాంగులు వృద్ధుల కోసం అవసరమైన సదుపాయాలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, ఇష్టపడి చదివి భావి భారత పౌరులు కావాలని ఆకాంక్షించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం మిక్స్డ్ వెజిటేబుల్ కర్రీ వడ్డించకపోవడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో, అదే విధంగా రాయపర్తి రైతు వేదిక ప్రక్కన నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని కలెక్టర్ పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో ఇళ్ల లబ్ధిదారు నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ పరిశీలించి షాబాషా దంపతులను అభినందించి త్వరగా గృహప్రవేశం చేయాలని కోరారు. అనంతరం రాయపర్తి మండలం వరంగల్ జిల్లా సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన, హౌసింగ్ పీడీ గణపతి, డి బి సి డి వో పుష్పలత, నోడల్ అధికారులు, తాసిల్దారులు, ఎంపీడీవోలు, తదితరులు ఉన్నారు.

## ఆలయాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం

**పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు పురావస్తు శాఖ అధికారులు**



**హన్మకొండ మహా;** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండ లోని ఎంపీ కార్యాలయంలో పురావస్తు శాఖ అధికారులతో పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలంటూ పురావస్తు శాఖ అధికారులకు ఎంపీ సూచించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపం మరమ్మతులు, విగ్రహ ప్రతిష్టాపన, శ్రీ భద్రకాళి ఆలయం, చిల్పూర్ లోని శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి తో పాటు, భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డి గుడి ప్రత్యేక శిలలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు పైలెట్ ప్రాజెక్టు కింద పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే వరంగల్ కోటలో ఉన్న 14 ఆలయాలకు పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని శంబుని గుడి, గణపేశ్వర స్వామి దేవాలయం (కోటగుల్లు), ఏకవీర/ఎల్లమ్మ ఆలయం, రెడ్డి గుడి దేవాలయం, త్రికూట దేవాలయాలు, కోటబురుజులు (ద్వారాలు), సర్వాయ్ పాపారాయుడు కోట, పాండవులు గుట్ట, సర్వతోభద్ర టెంపుల్,వేణుగోపాల స్వామి దేవాలయం,పద్మాక్షి ఆలయం,పంచకూటాలయాలను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు కేటాయిస్తే ఆలయాల అభివృద్ధి మరింత జరుగుతుందని వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ తెలిపారు. అనంతరం పురవస్తు శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వేయి స్తంభాల ఆలయాన్ని ఎంపీ డా. కడియం కావ్య స్వయంగా పరిశీలించారు.

## పాలస్తీనా ప్రజలపై దాడులు ఆపండి



**ఆలేరు, మహా:** గాజాపై ఇజ్రాయిల్, అమెరికా దాడులను నిరసిస్తూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో మంగళవారం నాడు CPI ML న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో నిరసననిరసన ప్రదర్శన తెలిపారు. ముందుగా ఆలేరు రైల్వే గేటు నుండి కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి బ్యాక్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో CPI ML న్యూ డెమాక్రసీ నాయకులు కల్లెపు అడవయ్య, ఆర్ జనార్ధన్, వాసుదేవ్,మామిడాలసోమయ్య, సుదర్శన తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలులో పొరపాట్లు జరగవద్దు

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** 2025 26 ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో 20252026, ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ కోసం రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు , సంబంధిత అధికారులతో వరి కొనుగోలు సన్నాహక సమావేశంలో అధికారులకు శిక్షణ తరగతులు కలెక్టరేట్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులందరూ టార్పాలిన్ కవర్లు ఎక్కువగా ఉంచుకోవాలన్నారు. కోటి మందిని కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో మహిళా సంఘాల ద్వారా కొనుగోలు సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఐకెపి, సమభావన సంఘాల సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సంస్థల ద్వారా సుమారు ( 322) కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ, అందుకోసం జిల్లా స్థాయి దాన్యం కొనుగోళ్ల కేంద్రాల కమిటీ ద్వారా ప్రభుత్వం సూచించిన ప్రకారం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు, ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వార స్వీకరించి కేంద్రాలకు వచ్చే దాన్యం పూర్తి వివరాలు డాటా ఎంట్రీ లో పొందుపరచాలన్నారు. కొనుగోలు రవాణా, డ్రై మిషన్,ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, మ్యాచ్చర్స్, ఆటోమేటిక్ జాలి మిషన్లు, ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

# జోనల్ స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే

- విద్యార్థులు విద్య క్రీడలలో నైపుణ్యం కలిగి ఉండాలి
- గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు క్రీడలు నిర్వీర్యం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- గురుకుల విద్యాపీట్ ఆవరణలో పోటీల నిర్వహణ



**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యార్థులు క్రీడల నైపుణ్యం చాటుకోవాలని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని, గురుకుల విద్యాపీట్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ స్థాయిలో 36 స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో టోర్నమెంట్, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపికలను, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరచాలని క్రీడలతో మంచి ప్రవర్తన కలిగి ఉంటారని అన్నారు. క్రీడాకారులు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చే విధంగా క్రీడాకారులను ఇచ్చిన గడ్డ మన హైదరాబాద్ అని కొనియాడారు. క్రీడాకారులుగా అయ్యుంటే హాస్పిటల్ కి వెళ్లాల్సిన అవసరమే ఉండదని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు క్రీడల నైపుణ్యం చాటుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా ప్రభుత్వం క్రీడాకారులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం విద్యార్థులను నేషనల్, వరల్డ్ లెవెల్ లో క్రీడలు ఆడే విధంగా క్రీడాకారులను తయారు చేయాలన్నారు. క్రీడాకారులకు కావలసిన వసతులను, సదుపాయాలు కల్పిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

**విద్యార్థులు విద్యలో, క్రీడలలో నైపుణ్యం కలిగి ఉండాలి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీలో రాబోయే తరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ యొక్క నాలుగో నగరాన్ని నిర్మించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యలో రాణించాలని, క్రీడలలో నైపుణ్యంతో కూడిన ప్రతిభ కనబరిచి, స్కిల్స్ పట్ల అవగాహన తెచ్చుకొని వాటిపై దృష్టి సారించాలని, నైపుణ్యాల కోసం ప్రభుత్వం స్కిల్స్ డెవలప్మెంట్ యూనివర్సిటీనే ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు, యువకులు తమ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకునే బాధ్యత మీ చేతుల్లో ఉందని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఎమ్మెల్యే.

**గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు క్రీడలు నిర్వీర్యం...**

గత ఉపాధి సంవత్సరాలు పాలించిన పాలకులు అప్పుల ఊబిలో పడేసి వెళ్లిన పరిస్థితి రాష్ట్రానిది అని మండిపడ్డారు. విద్య, క్రీడలను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని దుయ్యబట్టారు. పది సంవత్సరాలు అధికారాన్ని అనుభవించి, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన పాలకులు, రాష్ట్రంలో క్రీడలను పట్టించుకోకుండా, నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్వీర్యం చేశారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రజాపాలనలో ప్రజా ప్రభుత్వం, విద్యకు, క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, వందల కోట్లు వెచ్చించి నైపుణ్యం కలిగిన విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈసి శేఖర్ మామ, గురుకుల విద్యాపీట్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎంఈఓ హిర్యా నాయక్, అధికారులు, మాజీ జెడ్పిటిసి మహిపాల్, మాజీ కౌన్సిలర్ నీళ్ల భాను బాబు, ఏఎంసీ డైరెక్టర్లు డి రాజు, రామారావు, ప్రశాంత్ కుమార్, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, విద్యార్థులు, పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రైతులు డీలర్ నుంచి ఖచ్చితంగా బిల్లు తీసుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారి ఉషా**

**ఆమనగల్లు, మహా:** గ్రామాల్లో రైతులకు సీడ్ డీలర్స్ నకిలీ విత్తనాలు విక్రయించినట్లు సమాచారం అందితే అలాంటి వారిపై పీడీయాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా ఉషా డీలర్లను హెచ్చరించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సీడ్ షాప్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ తో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలర్ నుంచి ఖచ్చితంగా బిల్లు తీసుకోని పంటకాలం వరకు భద్రపరుచుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో నాణ్యమైన వ్యవసాయశాఖ సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున ప్రతి డీలర్ సరైన ఎరువుల నిలువలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎ శోభరాణి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ఆలేరు,మహా:** మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమ తరావు సూచించారు. మంగళవారం ఆలేరు మండలం శ రాజిపేట గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ లో మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకి మెను పాటించకుండా చారుతో పెట్టడంతో సంబంధిత ఏజెన్సీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ లో కమిటీ సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులు కూడా రోజు మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకి పెట్టే ఆహారం మెనూ ప్రకారం ఉందా లేదా పరిశీలించాలని అన్నారు. స్కూల్ లో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, పదవ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుండి పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల కోసం సిద్ధం అయ్యేలా విద్యా బోధన చేయాలి అన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనను అందించాలన్నారు.



## ఘనంగా కొమురంభీమ్ వర్ధంతి

**యాదాద్రి భువనగిరి, మహా:** కొమురంభీమ్ 65 వ వర్ధంతిని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు.... ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అధినపు కలెక్టర్ భాస్కరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## సీజేఐపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ



**ఆమనగల్లు, మహా :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై ఒక కేసు విషయంలో న్యాయవాది చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ అన్నారు. సీజెఐపై దాడిని ఖండిస్తూ మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ.. సీజెఐపై దాడి యత్నం దురదృష్టకరమని, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన హేయమైన చర్యని అన్నారు. సంబంధిత న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థను దేశంలోని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, కించపరిచే విధంగా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా శిక్షార్హులే అవుతారని అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పూల మల్లేష్, న్యాయవాదులు జానకి రాములు, మధు గౌడ్, గణేష్ గౌడ్, దేవేందర్, జగన్ గౌడ్, ఆంజనేయులు, శేఖర్, మహేశ్వర్, శ్రీనివాస్, బిక్య నాయక్, శ్రీశైలం, ప్రభు తదితరులున్నారు.

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం :టిఎస్ఎస్ఓ**

సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి బీ.ఆర్. గవాయ్ దాడికి యత్నించిన వక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ మీసాల చిక్కి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మన దేశ న్యాయవ్యవస్థలో అత్యునత స్థానంలో ఉన్న బీ.ఆర్. గవాయ్ పై జరిగిన దాడి దేశ ప్రజలను కలిచివేసింది.ఇది మన దేశ చరిత్రలో ఒక చీకటి రోజన్నారు. ఇలాంటి పిరికిపంద దాడులతో తాను వెనక్కి తగ్గబోనని ధైర్యంగా ప్రకటించిన మన అజేయమైన భారత ప్రధాన న్యాయమూర్తి బీ.ఆర్.గవాయ్ మా స్టూడెంట్స్ మద్దతు ఎప్పుడు ఉంటుందని అని తెలిపారు'.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై దాడిని ఖండిస్తున్నాం

**మంచిర్యాల అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఎస్పి నిరసన**



**మంచిర్యాల,మహా:** సుప్రీం కోర్టు న్యాయమూర్తి పైదాడిని బహుజన సమాజ్ పార్టీ ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా ఐబి, అంబేద్కర్ చౌరస్తాలో బిఎస్పి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ అత్యుత్తమ న్యాయమూర్తి సీజేఐ గవాయి పై దాడికి యత్నించడాన్ని తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. న్యాయమూర్తి దళితుడనే ఉద్దేశంతో అగ్రవర్ణాలు, ఆర్ఎస్ఎస్ మూకలు ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్రగా తాము భావిస్తున్నామని అనుమానం వ్యక్తం చేశారు.ఇలాంటి ఘటనలు మరోసారి పునారావృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కాదశి రవీందర్, ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, బెల్లంపల్లి అధ్యక్షులు దాగం శ్రీనివాస్, బూడిద మల్లేష్, కుమ్మరి కృష్ణ చైతన్య, శంకర్, శెట్టి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## రత్నాకర్ అనే దొంగ వల్లనే వాల్మీకి ఋషిగా మారాడు

- రామాయణ మహాకావ్యాన్ని రాసిన మహనీయుడు
- మందమర్రి జిఎం కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**మందమర్రి, మహా :** రత్నాకర్ అనే దొంగ వల్లనే వాల్మీకి ఋషిగా మారాడని సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ ఉద్ఘాటించారు. మంగళవారం స్థానిక జిఎం సమావేశ మందిరంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జిఎం మాట్లాడుతూ భారతీయ చంద్రమాన క్యాలెండర్లో అశ్విని మాసంలోని పౌర్ణమి రోజున వాల్మీకి జయంతి వేడుకలు ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుండి రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు కార్యాలయాలలో అధికారికంగా జరుపుకుంటున్నామని తెలిపారు. బోయ కులంలో పుట్టి భారత సంస్కృతి సాంప్రదాయాలను పట్టించి రామాయణం అనే మహాకావ్యాన్ని రచించిన మహా ఋషి వాల్మీకి అని కొనియాడారు. అంతకుముందు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్ ఓ టు జి ఎం విజయ ప్రసాద్, గుర్తింపు సంఘం మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సి ఎం ఓ ఏ ఐ అధ్యక్షులు రమేష్, డిప్యూటీ పిఎం ఎండి అసిఫ్, సీనియర్ పిఓ సత్యనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని ఐటిఐ ఆవరణలో గల అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సాంకేతిక కోర్సులలో శిక్షణ పొందడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని అన్నారు ఏ టీ సి సెంటర్ లో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఏ ఏ కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ ఇస్తున్నారని.విద్యార్థులకు అన్నివసతులు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. విద్యార్థులు అందరూ కూడా కష్టపడి శ్రద్ధ తో ట్రైనింగ్ పూర్తి చేసుకోవాలని సూచించారు . రాబోయే కాలంలో మొత్తం ఈ అడ్వాన్స్డ్ టెక్నాలజీ రంగంలో జాబ్ లు ఉంటాయని అన్నారు. డిగ్రీ ఇతర చదువుల ద్వారా మాత్రమే కాకుండా సాంకేతిక విద్య ద్వారా ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రైవేటు ఉద్యోగాలు కూడా పొందవచ్చును అన్నారు. ఏటీసీలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్ బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విద్యతోపాటు పరిశోధనలు సమాజానికి ప్రయోజనం చేకూర్చాలి

**చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి**

**మొయినాబాద్ మహా:** విద్యతోపాటు పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని చైతన్య డిమ్ టూబీ యూని వర్సిటీ ఛాన్సలర్ సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో కె.జయ శ్రీ (హెచ్ డి పి ఎఫ్ ఏ) "హైబ్రిడ్ ఫీచర్ సెలక్షన్ మెథడ్ ఫర్ హార్ట్ డిసీస్ ప్రిడిక్షన్ ఫ్రేంవర్క్ యూసింగ్ మేషన్ లెర్నింగ్" అనే అంశంపై చేసిన పరిశోధన సిద్ధాంతానికి ఆమె ఈ ఘనత సాధించారు. ఆమెకు పి.హెచ్.డి డిగ్రీ పట్టా లభించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.శంకర్ లింగం, ఆచార్య ఎన్.సతీష్ కుమార్ సహా పర్యవేక్షణలో జరిగింది. పి.హెచ్.డి డిగ్రీ పట్టా పొందిన కె.జయ శ్రీ చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సిహెచ్.వి. పురుషోత్తంరెడ్డి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన జాతీయ అభివృద్ధికి కీలకమైందని ఇది గొప్ప గర్వకారణమని తెలిపారు. విద్య పరిశోధనలు సమాజానికి సంబంధితంగా ప్రభావవతంగా చేయడం యొక్క ప్రాముఖ్యతను ఆయన గుర్తు చేశారు.

## ఆటో డ్రైవర్ లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసిపి కె చంద్రశేఖర్ రెడ్డి**

**గండిపేట,మహా:** నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసిపి ఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగ్ పరిధిలోని కేవీఎంఆర్ గార్డెన్స్ లో నార్సింగి ట్రాఫిక్ సిఐ పి.ఆంజనేయులు మరియు అడిషనల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ మరియు ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. అంతే కాకుండా రద్దీ ప్రాంతాలలో ఆటోలను నడిపే విధానాన్ని వారికి వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన ఎడల జరిగే పరిణామాలను కూడా తెలియజేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను ఆటో డ్రైవర్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నార్సింగి పరిధిలోని అల్కాపురి కాలనీ, పుప్పాలగూడ, బి ఆర్ సి తదితర ప్రాంతాలలోని కాలనీవాసులతో మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలను తెలుసుకున్నారు. మరియు సమస్యాత్మక ప్రాంతాలలో ట్రాఫిక్ ను తరగతిన అరికట్టేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వివిధ విభాగాల అధికారులతో ఇన్చార్జి కమిషనర్ సమీక్ష సమావేశం


**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఇంచార్జ్ కమిషనర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులతో మంగళవారం కౌన్సిల్ హాల్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనుల నిర్వాహణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ, ఎల్ఆర్ఎస్ , భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణల పై చర్యలు, అడ్వర్ టైజ్ మెంట్, పన్నుల వసూలు కోర్టు కేసులు, నూతన సంఘాల ఏర్పాటు, వివిద లక్ష్యాల సాధన, స్ట్రీట్ వెండర్స్ జోన్స్ విధానం, భువన్ జీయో ట్యాగ్గింగ్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, ఆన్అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టుట, వీధి దీపాల నిర్వాహణ, రిపైర్స్, వన మహోత్సవం నందు టార్గెట్ ప్రకారము మొక్కలు నాటుట మరియు సంరక్షణ పై సమీక్షించారు.

## రోజుకు 12 గంటల నిద్ర!.. ఇదే నా సక్సెస్ సీక్రెట్: టెలిగ్రామ్ సీఈఓ



స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని అరచేతిలో చూపిస్తుందని.. అందరూ నమ్ముతుంటే, ఫోన్ వాడకపోవడం వల్లే నేను సక్సెస్ సాధించా అని టెలిగ్రామ్ కోఫౌండర్, సీఈఓ పావెల్ దురోవ్ చెబుతున్నారు. ఇంతకీ అదెలా సాధ్యమైంది?, వివరాలు ఏమిటనేది ఇక్కడ తెలుసుకుందాం. లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ''రోజులో వీలైనంత సమయం.. సుమారు 11 నుంచి 12 గంటలు నిద్ర కోసం కేటాయించడానికి ప్రయత్నిస్తాను. అయితే అన్ని గంటలు నిద్రకోసం కేటాయించినా.. నిద్రపోను. మంచం మీద పడుకుని ఆలోచిస్తూనే ఉంటాను'' అని దురోవ్ పేర్కొన్నారు. పడుకున్నప్పుడే.. నాకు అద్భుతమైన ఆలోచనలు వస్తాయి. తాను సోషల్ నెట్‌వర్కింగ్‌లో ఉన్నప్పటికీ.. స్మార్ట్‌ఫోన్ వాడకం చాలా తక్కువని పేర్కొన్నారు. నిద్ర లేచిన వెంటనే తన ఫోన్ చూడకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. నోటిఫికేషన్‌లు, సోషల్ మీడియా వంటివన్నీ ఒక వ్యక్తి రోజును డిసైడ్ చేస్తాయని నమ్ముతాను. జీవితంలో ఏది ముఖ్యమైనదో నిర్ణయించుకోవాలి. ఇతర వ్యక్తులు, కంపెనీ వంటివన్నీ మన జీవితంలో చాలా ముఖ్యమైనవి కాదు. ప్రతి రోజూ ఉదయం ఫోన్ లేకుండానే మీ దినచర్యను ప్రారభించడం అలవాటు చేసుకోవాలి. వ్యాయామం చేసేటప్పుడు.. ఇతరత్రా పనులు చేసేటప్పుడు కూడా వీలైనంత ఫోనుకు దూరంగా ఉండాలి. ఫోన్ దూరంగా ఉన్నప్పుడే మీకు అద్భుతమైన ఆలోచనలు రావొచ్చని దురోవ్ చెబుతున్నారు. టెక్నాలజీ, కనెక్టివిటీ వంటి వాటికి మద్దతు ఇస్తున్నప్పటికీ.. జీవితంలో ఏది ముఖ్యమో దానికోసం సమయం వెచ్చించాలని ఆయన సూచించారు.

## ఫ్లెక్స్ ఆఫీస్ ట్రెండ్.. హైదరాబాద్ టాప్





దేశంలో ఫ్లెక్స్ ఆఫీస్ ట్రెండ్ వేగంగా సాగుతోంది. అభివృద్ధి చెందిన నగరాల్లో.. హైబ్రిడ్ వర్క్ మోడల్‌కు ఇదొక ఉత్తమ పరిష్కారం. మైహెచ్‌క్యూ 'ఫ్లెక్స్ ఆఫీస్ స్టాక్ ఫుట్‌ప్రింట్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. మైహెచ్‌క్యూ డేటా ప్రకారం.. భారతదేశంలోని మొత్తం ఫ్లెక్స్ ఆఫీసులలో హైదరాబాద్ ముందు వరుసలో ఉంది. ఈ నగరం ఫ్లెక్స్ ఆఫీస్ హబ్‌గా మారింది. ఇక్కడ కూడా ప్రధానంగా.. హైటెక్ సిటీలో 23.4 శాతం ఫ్లెక్స్ ఆఫీసుల, మాదాపూర్‌లో 11.2 శాతం ఉన్నట్లు నివేదిక చెబుతోంది. ఆ తరువాత జాబితాలో బంజారా హిల్స్ (9.9%), బేగంపేట (9.9%), కొండాపూర్ (9.5%), ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ (5.3%) మొదలైనవి ఉన్నాయి. మెట్రో సౌకర్యం, రవాణా కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో ఫ్లెక్స్ ఆఫీసుల సంఖ్య పెరుగుతోంది. ఈ సంఖ్య గడిచిన మూడేళ్ళలో పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం ఫ్లెక్సిబుల్ వర్క్ కల్చర్ ట్రెండ్‌సెట్టర్‌గా మారిపోయింది. దీంతో ఫ్లెక్స్ ఆఫీసులకు డిమాండ్ పెరుగుతోంది. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం ప్రారంభమైంది. అయితే కరోనా దాదాపు కనుమరుగైపోయినప్పటికీ.. ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ విధానాలకు అలవాటుపడిపోయారు. దీనిని నివారించడానికి.. సంస్థలు హైబ్రిడ్ వర్క్ కల్చర్ స్టార్ట్ చేశాయి. దీనికోసం ఫ్లెక్స్ ఆఫీసులను ఎంచుకోవడం మొదలైంది. దీంతో ఫ్లెక్సిబుల్ ఆఫీసులు పుట్టుకొచ్చాయి. ఫ్లెక్సిబుల్ సొల్యూషన్స్ ప్రస్తుతం అన్ని కార్యాలయ లావాదేవీలలో 20% వాటా కలిగి ఉన్నాయి. 2030 నాటికి ఈ మార్కెట్ వ్యాప్తి దాదాపు 30%కి చేరుకుంటుందని సమాచారం.

**ఫ్లెక్స్ ఆఫీస్ ఉపయోగాలు**

ఫ్లెక్స్ ఆఫీస్ అనేది.. ఒకవిధమైన ఆఫీస్ వర్క్ స్పేస్. ఇక్కడ ఉద్యోగులు సౌకర్యవంతంగా పనిచేసుకోవచ్చు. స్టార్టప్ కంపెనీలు తక్కువ ఖర్చుతో.. కార్యాలయ నిర్వహణ చేసుకోవడానికి ఫ్లెక్స్ ఆఫీస్ ఉపయోగపడుతుంది. ఫ్రీలాన్సర్లు, రిమోట్ వర్కర్లు తమకు అవసరమైన స్థలాన్ని ఎంచుకుని పని చేయవచ్చు. ఉద్యోగ వాతావరణం ఉంటుంది కాబట్టి.. ప్రొడక్టివిటీ కూడా పెరుగుతుంది.

## సేవల రంగంలో నిదానించిన వృద్ధి



సేవల రంగంలో కార్యకలాపాల వృద్ధి సెప్టెంబర్ నెలలో కాస్తంత నిదానించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సేవల రంగం పీఎంఐ ఆగస్ట్‌లో 15 ఏళ్ల గరిష్ట స్థాయి 62.9 పాయింట్లకు చేరగా, సెప్టెంబర్‌లో 60.9కు తగ్గింది. అయినప్పటికీ 50 పాయింట్లకు పైన నమోదు కావడాన్ని వృద్ధి కిందే పరిగణిస్తుంటారు. వేగం తగ్గినప్పటికీ, వృద్ధి ధోరణికి ఢోకా లేదని హెచ్‌ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా భారత సేవలకు డిమాండ్ కొంత నిదానించడంతో వృద్ధి వేగానికి కాస్త బ్రేకులు పడినట్టయింది. సెప్టెంబర్‌లో ఎగుమతుల్లో వృద్ధి నెలకొన్నప్పటికీ, ఈ ఏడాది మార్చి తర్వాత నుంచి చూస్తే తక్కువకు పరిమితమైనట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వే గుర్తించింది. సెప్టెంబర్‌లో ఉపాధి కల్పన సైతం మోస్తరు స్థాయికి నిదానించిందని, కేవలం 5 శాతానికంటే కొంచెం ఎక్కువ కంపెనీలు నియామకాల్లో వృద్ధిని నమోదు చేసినట్టు తెలిపింది. ఇక భవిష్యత్తు కార్యకలాపాలకు సంబంధించిన సూచీ మాత్రం ఈ ఏడాది మార్చి తర్వాత గరిష్ట స్థాయికి చేరుకుంది. భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాల పరంగా సేవల రంగ కంపెనీల్లో ఆశాభావం బలపడినట్టు ఈ సర్వే పేర్కొంది. సెప్టెంబర్ నెలకు సంబంధించి హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ (తయారీ, సేవల రంగం కలిపి) 61గా నమోదైంది. ఆగస్ట్‌లో ఇది 63.2 పాయింట్లుగా ఉంది. ఈ ఏడాది జూన్ తర్వాత తక్కువ వృద్ధి రేటు ఇదే కావడం గమనార్హం.

## జీఎస్టీ క్రమబద్ధీకరణ తర్వాత ఎస్‌బీఐ జనరల్ నుంచి కొత్త హెల్త్ ప్లాన్

భారతదేశంలో ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటైన ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ తమ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా హెల్త్ ఆల్ఫా పేరుతో సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఆధునిక వైద్య ఖర్చులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, అన్ని వయసుల వారికి మెరుగైన రక్షణ కల్పించడానికి రూపొందిస్తున్నట్లు చెబుతున్న ఈ ప్లాన్ వివిధ రకాల ప్రత్యేకతలు, సౌకర్యాలు, ప్రయోజనాలు కలిగి ఉందని కంపెనీ తెలిపింది. అనూహ్యంగా పెరిగే వైద్య ఖర్చుల నుంచి పాలసీదారులకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఎస్‌బీఐ జనరల్ ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. జీఎస్టీ సంస్కరణల తర్వాత ఎస్‌బీఐ ప్రారంభించిన మొదటి ఆరోగ్య బీమా ఇది. అదనంగా ప్రీమియం చెల్లించకుండా 10 రెట్లు క్లెయింఫ్రీ క్యుమిలేటివ్ బోనస్‌ను అందిస్తున్నట్లు చెప్పింది. ఈ ప్లాన్‌లో బేస్ కవరేజీపై గరిష్ట పరిమితి లేదని తెలిపింది. 'జిమ్, స్పోర్ట్స్ ఇంజ్యూరీ కవరేజి కూడా లభిస్తుంది. అందుకు ఓపీడీ ప్రయోజనాలు, పరీక్షలు, చికిత్స, మందుల ఖర్చులు కూడా కవర్ అవుతాయి. ప్లాన్ కొనుగోలు చేసేందుకు కోట్ చేసిన 5 రోజుల్లోగా కొనుగోలు చేసినట్లయితే ప్రీమియంపై 5% తగ్గింపు పొందవచ్చు' అని కంపెనీ తెలిపింది.


## ఏపీలో 172 బావుల ఏర్పాటుకు రూ.8,110 కోట్లు



ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది పెట్రోలియం మైనింగ్ లీజు (PML) బ్లాకుల్లో 172 ఆన్‌షోర్ బావులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. వీటి ద్వారా చమురు, గ్యాస్ ఉత్పత్తి కోసం రూ.8,110 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడవులు, వాతావరణ మార్పులకు సంబంధించిన ఒక కమిటీ గత నెలలో జరిగిన సమావేశంలో ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి (EC) ఇవ్వడానికి సిఫార్సు చేసింది. ఈ ఆన్‌షోర్ బావుల ఏర్పాటు కోసం పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (EMP)కు సంబంధించి మూలధన వ్యయం రూ.172 కోట్లుగా కంపెనీ నిర్ణయించింది. ఏటా ఈఎంపీ రెన్యువల్ కోసం చేసే ఖర్చు రూ.91.16 కోట్లు ఉంటుందని చెప్పింది. కమిటీ బహిరంగ విచారణలో చేసిన హామీల కోసం రూ.11 కోట్లు కేటాయించనున్నట్లు పేర్కొంది. పర్యావరణ అనుమతిని సిఫార్సు చేస్తూ కమిటీ ఓఎన్‌జీసీని అన్ని పర్యావరణ పరిరక్షణ చర్యలు, భద్రతా ఏర్పాట్లను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది.మే నెలలో జారీ చేసిన ఎన్‌ఓసీ (NOC) ప్రకారం కోరింగా వన్యప్రాణుల అభయారణ్యం పర్యావరణ సున్నిత ప్రాంతం నుంచి 10 కి.మీ. లోపు ఏ బావిని కూడా ఏర్పాటు చేయరు. ముందస్తు అనుమతి లేకుండా అటవీ భూమి/రక్షిత ప్రాంతంలో పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయరు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## రూ.24,634 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ.. రూ.24,634 కోట్ల విలువైన నాలుగు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని 18 జిల్లాలను అనుసంధానం చేసే ఈ నాలుగు ప్రాజెక్టులు ప్రస్తుత భారతీయ రైల్వే నెట్‌వర్క్‌ను సుమారు 894 కి.మీ. మేరకు విస్తరించనున్నాయి.

**నాలుగు ప్రాజెక్టులు ఇవే..**

**వార్ధా - భూసావల్ - 3వ, 4వ లైన్ - 314 కి.మీ (మహారాష్ట్ర)**

**గోండియా - డోంగర్‌గఢ్ - 4వ లైన్ - 84 కి.మీ (మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్)**

**వడోదర - రత్లం - 3వ, 4వ లైన్ - 259 కి.మీ (గుజరాత్, మధ్యప్రదేశ్)**

**ఇటార్సి - భోపాల్ - బినా 4వ లైన్ - 237 కి.మీ. (మధ్యప్రదేశ్)**

కేబినెట్ ఆమోదం పొందిన ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్ట్ సుమారు 3,633 గ్రామాలకు కనెక్టివిటీని పెంచుతుంది. ఇది దాదాపు 85.84 లక్షల జనాభాకు ప్రయోజనం కలిగించనుంది. పెరిగిన ఈ రైల్వే లైన్ సామర్థ్యం భారతీయ రైల్వేలకు మెరుగైన కార్యాచరణను అందిస్తుంది. ఈ ప్రాజెక్టులు ప్రయాణికులు, వస్తు సేవలకు సమర్థవంతమైన కనెక్టివిటీని అందించనున్నాయి. ఈ నూతన ప్రాజెక్టు సాంచి, సాత్పురా టైగర్ రిజర్వ్, భీంబెట్కాలోని రాక్ షెల్టర్, హజారా జలపాతం, నవేగావ్ నేషనల్ పార్క్ మొదలైన ప్రముఖ గమ్యస్థానాలకు రైలు కనెక్టివిటీని అందిస్తుంది. ఇది పర్యాటకులకు అనువైన రవాణా మార్గాన్ని అందించనుంది. బొగ్గు, కంటైనర్లు, సిమెంట్, ఫ్లై యాష్, ఆహార ధాన్యాలు, ఉక్కు మొదలైన వస్తువుల రవాణాకు ఈ ప్రాజెక్టు ఉపకరించనుంది. రైల్వే లైన్ సామర్థ్యం పెంపుదల కారణంగా ఫలితంగా 78 ఎంటీపీఏ (సంవత్సరానికి మిలియన్ టన్నులు) పరిమాణంలో అదనపు సరుకు రవాణా జరగనుంది.

## భారీ ఎన్‌కౌంటర్

### రూ. లక్ష రివార్డు గ్యాంగ్‌స్టర్ హతం





**న్యూఢిల్లీ:** పలు ఘోరమైన నేరాలకు పాల్పడుతూ, పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ నేపాలీ గ్యాంగ్‌స్టర్ ఎట్టకేలకు హతమయ్యాడు. ఢిల్లీ, గురుగ్రామ్ పోలీసులు సోమవారం రాత్రి సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భీమ్ మహాబహదూర్ జోరా (30) అనే మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ప్రాణాలు కోల్పోయాడు. అతడి తలపై పోలీసులు లక్ష రూపాయల రివార్డు ప్రకటించారు. గత రాత్రి నెహ్రూ ప్లేస్ సమీపంలోని ఆస్థా కుంజ్ పార్క్‌లో జోరా తన అనుచరుడితో కలిసి ఉన్నాడన్న పక్కా సమాచారంతో గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్, ఢిల్లీ పోలీసుల స్పెషల్ బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. పోలీసులను గమనించిన జోరా, వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఒక బుల్లెట్ గురుగ్రామ్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర శర్మ బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌కు తగలడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. లొంగిపోవాలని పోలీసులు పదేపదే హెచ్చరించినా జోరా వినకుండా కాల్పులు కొనసాగించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ గందరగోళంలో జోరా అనుచరుడు చీకట్లో తప్పించుకున్నాడు. జోరా అనేక హత్యలు, దోపిడీలు, దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ముఖ్యంగా 2024 మే నెలలో ఢిల్లీలోని జంగ్‌పురాలో డాక్టర్ యోగేష్ చంద్ర పాల్ (63) హత్య కేసులో ఇతనే ప్రధాన సూత్రధారి. ఆ దోపిడీ యత్నంలో డాక్టర్‌ను దారుణంగా హత్య చేసి 17 నెలలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు ఇదివరకే అరెస్ట్ చేశారు. ఇటీవల గురుగ్రామ్‌లో ఓ బీజేపీ నేత ఇంట్లో జరిగిన రూ. 20 లక్షల దొంగతనం కేసులో కూడా జోరా ప్రమేయం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జోరా నేపాల్ కేంద్రంగా ఓ పెద్ద అంతర్జాతీయ దొంగల ముఠాను నడుపుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ముఠా సభ్యులు నకిలీ ఆధార్ కార్డులతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లోని సంపన్నుల ఇళ్లలో పనివాళ్లుగా చేరతారు. యజమానుల నమ్మకం చూరగొన్న తర్వాత, వారికి మత్తుమందు ఇచ్చి లేదా బంధించి ఇళ్లలోని నగదు, బంగారం, విలువైన వస్తువులతో నేపాల్‌కు పారిపోవడం వీరి పద్ధతి.

## తుపాకీతో కాల్చుకుని.. సీనియర్ ఐపీఎస్ అధికారి ఆత్మహత్య



**గుర్గావ్:** హర్యానా రాజధాని చండీగఢ్‌లో విషాదం జరిగింది. హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ వై. పురాణ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇవాళ (మంగళవారం అక్టోబర్ 7) సెక్టార్ 11లో ఉన్న తన నివాసంలోనే సర్వీస్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న చండీగఢ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పురాణ్ కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. పురాణ్ ఆత్మహత్యకు గల కారణాలపై పలు కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలా? మరేదైనా ఉందా అన్న కోణంలో విచారణ చేపట్టారు. ఆయన మొబైల్ ఫోన్‌తో పాటు వస్తువులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, నిజాయితీ, నిబద్ధత గల అధికారిగా పురాణ్‌కు పోలీస్ శాఖలో మంచి పేరుంది. అలాంటి వ్యక్తి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) హోదాలో పురాణ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా హర్యానా పోలీస్ శాఖలో సేవలు అందిస్తున్నారు. ఆయన భార్య, ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ పి కుమార్ కూడా ఆ రాష్ట్ర కేడర్‌లోనే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె విధుల్లో భాగంగా విదేశీ పర్యటనలో ఉన్నారు. హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీతో పాటు జపాన్ పర్యటనకు వెళ్లారు. భర్త మరణించిన విషయం తెలుసుకున్న ఆమె వెంటనే భారత్‌కు తిరుగు పయనమయ్యారు. ఆత్మహత్యకు కారణం ఇంకా తెలియాల్సి ఉందని దర్యాప్తు ప్రారంభించామని ఓ సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు. కుటుంబ సభ్యులు, సిబ్బంది వాంగ్మూలాలు నమోదు చేస్తున్నామని తెలిపారు.

## స్ట్రాంగ్ రూమ్ తనిఖీ.. అత్యవసర సమావేశం



**తిరువనంతపురం:** కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం మాయమైన ఉదంతంలో దర్యాప్తు చేపట్టేందుకు అధికారులు మంగళవారం శబరిమల చేరుకున్నారు. దేవస్వం విజిలెన్స్ పర్యవేక్షణలో, ఆలయంలోని స్ట్రాంగ్ రూమ్ తెరిచి తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ పరిణామాలపై చర్చించేందుకు దేవస్వం బోర్డు అత్యవసర సమావేశం నిర్వహించనుంది. శబరిమల ఆలయంలో బంగారు పూత, ద్వారపాలక విగ్రహాల పీఠం అదృశ్యంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని కేరళ మంత్రి వీఎన్ వాసవన్ స్పష్టం చేశారు. "శబరిమల అభివృద్ధిని నిర్ధారించడం, భక్తులకు సౌకర్యాలను మెరుగుపరచడంలోనే ప్రభుత్వం పాత్ర ఉంటుందన్నారు. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఈ వివాదంలో ఇరికించడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తోందని' ఆయన ఆరోపించారు. గతంలో సువర్ణ దాత ఉన్నికృష్ణన్ పొట్టి.. కనిపించకుండా పోయిందని పేర్కొన్న ద్వారపాలక శిలాపీఠం అతని సోదరి ఇంట్లో దొరికిందని తెలుస్తోంది. దీంతో పొట్టి ఫిర్యాదు వెనుక కుట్ర ఉందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆ బంగారు వస్తువు 2019లో కనిపించకుండా పోయింది. ఇటీవలే దేవస్వం విజిలెన్స్ బృందం దానిని స్వాధీనం చేసుకుంది. అయితే ప్రతిపక్షాలు వాస్తవాలను వక్రీకరించి, ప్రస్తుత పరిస్థితి గురించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ప్రభుత్వం చెబుతోంది. ప్రతిపక్ష సభ్యులు గతంలో దాదాపు నాలుగు కిలోగ్రాముల బంగారాన్ని తొలగించారని అసెంబ్లీలో ఆరోపించారు. కాగా 1998లో విజయ్ మాల్యా విరాళంగా ఇచ్చిన బంగారాన్ని ప్రజా పనుల శాఖ అధికారులు తూకం వేసి, డాక్యుమెంట్ చేశారని రికార్డులు చూపిస్తున్నాయి. కోర్టు ఆదేశం మేరకు దేవస్వం అధికారులు ఆ పనిని చేపట్టారు. ఈ నేపథ్యంలో 1998 నుండి జరిగిన అన్ని కార్యకలాపాలను దర్యాప్తులో చేర్చాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

## కరూర్ తొక్కిసలాట.. బాధిత కుటుంబాలకు విజయ్ పరామర్శ





**చెన్నై:** కోలీవుడ్ ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలను విజయ్ ఇవాళ (మంగళవారం అక్టోబర్ 7) వీడియో కాల్‌లో పరామర్శించారు. వారిని ఓదార్చిన విజయ్.. త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని తెలిపారు. "నేను మీతో ఉన్నాను, మీకు అండగా ఉంటానని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. అయితే, వీడియో కాల్ సమయంలో ఫోటోలు తీసుకోవద్దని.. రికార్డ్ చేయవద్దని ఆయన బృందం కోరింది. ప్రతి వీడియో కాల్ సుమారు 20 నిమిషాల పాటు సాగిందని సమాచారం. వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో కరూర్ తొక్కిసలాట తమిళనాడు రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే పార్టీకి చెందిన కొందరు నేతలను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టీవీకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, మొదట వ్యతిరేకించిన కోర్టు.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. కాగా, టీవీకే పార్టీకి 10 వేల మందికి మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ సుమారు 30 వేల మందికి పైగా హాజరయ్యారు. భారీగా జనం హాజరవుతారని అధికారులు ముందుగా అంచనా వేయలేకపోయారు.

# లాటరీ కింగ్?



నాగార్జున కెరీర్‌లోని వందో సినిమా చిత్రీకరణ కోసం కొన్ని రోజులుగా సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తమిళ దర్శకుడు ఆర్ఏ కార్తీక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అక్కినేని నాగార్జున ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా, ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైందని తెలిసింది. తొలి షెడ్యూల్‌లో నాగార్జున పాల్గొంటున్నారని సమాచారం. ఈ సినిమాకు 'కింగ్ 100', 'కింగ్ 100 నాటౌట్' అనే టైటిల్స్‌ను మేకర్స్ అనుకుంటున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అయితే తాజాగా 'లాటరీ కింగ్' అనే మరో టైటిల్‌ను కూడా మేకర్స్ పరిశీలిస్తున్నారట. అంతేకాదు.. కథ రీత్యా ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారని, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారని టాక్. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# కాంతార చాప్టర్-1..

## 90 శాతం అక్కడే పూర్తి చేశాం: రిషబ్ శెట్టి



రిషబ్ శెట్టి స్వీయ డైరెక్షన్‌లో వచ్చిన తాజా చిత్రం కాంతార చాప్టర్ 1. భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా దసరా కానుకగా థియేటర్లలో సందడి చేసింది. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకెళ్తోంది. సూపర్ హిట్ మూవీ కాంతారకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమా అదిరిపోయే కలెక్షన్స్ రాబడుతోంది. కర్ణాటకలోని ప్రాచీన కళ భూతకోల ఆధారంగా ఈ సినిమాలను తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తకర విషయం బయటకొచ్చింది. ఈ మూవీ షూటింగ్ రిషబ్ శెట్టి తన సొంత గ్రామంలోనే తెరకెక్కించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా దాదాపు 90 శాతం ఎడిటింగ్ తన ఊర్లోనే పూర్తి చేశామని రిషబ్ శెట్టి తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన రిషబ్ ఈ విషయాన్ని పంచుకున్నారు. కాగా.. కర్ణాటకలోని ప్రత్యేక ప్రాంతానికి సంబంధించిన సంస్కృతి, జానపద కథ నిర్మాణం కోసం రిషబ్ శెట్టి తన స్వగ్రామం లోనే ఎక్కువగా ఈ మూవీని చిత్రీకరించినట్లు తెలుస్తోంది. రిషబ్ శెట్టి మాట్లాడుతూ..'ఈ సినిమా దాదాపు 90 శాతం పోస్ట్, ప్రొడక్షన్ పనులన్నీ మా సొంత గ్రామంలోనే జరిగాయి. మేము కేవలం మిగిలిన పదిశాతం పనికోసమే బెంగళూరు, కొచ్చికి వచ్చాం. ఈ సినిమా కోసం ఏకంగా సంగీత దర్శకుడిని కూడా గ్రామానికి తీసుకువచ్చి అక్కడే మొత్తం రికార్డింగ్ పూర్తి చేశాం. సినిమా ఎడిటింగ్‌లో దాదాపు 90 శాతం మా గ్రామంలోనే జరిగింది. మా గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున షూటింగ్ వద్దకు రావడంతో ఒకరకంగా ఫిల్మ్ టౌన్‌గా మారిపోయింది. ప్రతి రోజు కనీసం 100 వాహనాలు షూటింగ్‌కు వచ్చేవి. దాదాపు ప్రతి రోజు వెయ్యిమందిని సెట్‌లో ఉంచాం. కాంతార కోసమే నేను, నా భార్య, పిల్లలతో కలిసి నా స్వగ్రామానికి వెళ్లా' అని అన్నారు. కాగా.. కాంతార: చాప్టర్ 1 కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్, జయరామ్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటించారు.



# ది ఇండియా స్టోరీ పూర్తి

'ది ఇండియా స్టోరీ' సినిమాను పూర్తి చేశారు కాజల్ అగర్వాల్. శ్రేయాస్ తల్పాడే, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిందీ సినిమా 'ది ఇండియా స్టోరీ'. డీకే చేతన్ దర్శకత్వంలో ఎమ్ఐజీ ప్రొడక్షన్స్ అండ్ స్టూడియోస్ పతాకంపై సాగర్ బి. షిండే నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయినట్లు సోమవారం ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో లాయర్‌గా నటించారు కాజల్. రైతుల కష్టాలు, కార్పొరేట్ సంస్థలు తయారు చేసే పంటల పిచికారీ మందుల వ్యాపారాలు వంటి అంశాల నేపథ్యంతో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ సమాచారం. మురళీ శర్మ, మనీష్ వాధ్వా, త్రిషా సర్ధా కీలక పాత్రల్లో నటించిన 'ది ఇండియా స్టోరీ'ని ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నా కుదరలేదు. 2026లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు మేకర్స్.




### లేడీ ఓరియెంటెడ్ సినిమా..

# రేసులో ఇద్దరు బ్యూటీస్!

రీసెంట్ టైంలో కంటెంట్ లేదా భారీతనం ఉంటేనే ఆయా సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. స్టార్ హీరోలు పాన్ ఇండియా మూవీస్ చేస్తూ బిజీగానే ఉన్నారు. మరోవైపు పలు నిర్మాణ సంస్థలు కంటెంట్ ఉండే లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు తీసేందుకు అప్పుడప్పుడు ఇంట్రెస్ట్ చూపిస్తుంటాయి. ఇప్పుడు అలా అనుకున్న ప్రాజెక్ట్ కోసం రేసులో ఇద్దరు హీరోయిన్ల పేర్లు వినిపిస్తున్నాయట. 'మహానటి', 'సీతారామం', 'కల్కి' చిత్రాలతో మళ్లీ పుంజుకున్న వైజయంతీ మూవీస్.. తాజాగా 'చుక్కలు తెమ్మన్నా.. తెంచుకురానా' అనే టైటిల్ రిజిస్టర్ చేయించారు. ఇదో ఫిమేల్ సబ్జెక్ట్ అని, అయితే లీడ్ రోల్ కోసం శ్రీలీల లేదా భాగ్యశ్రీ బోర్సే పేర్లు పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తుంది. తండ్రి కూతురు బ్యాక్ డ్రాప్ ఎమోషన్లతో ఈ మూవీ తీయబోతున్నారనే తెలుస్తోంది. ప్రస్తుతం ట్రెండింగ్ హీరోయిన్లలో శ్రీలీల, భాగ్యశ్రీ ఉన్నారు. కమర్షియల్ సినిమాల్లో వీళ్ల యాక్టింగ్‌పై చిన్నపాటి కంప్లైంట్స్ ఉన్నప్పటికీ.. వీళ్లని మెయిన్ లీడ్‌గా పెట్టి ఓ మూవీ అంటే ఏదో డిఫరెంట్‌గానే ట్రై చేస్తున్నారా అనిపిస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్ట్ గురించి అధికారిక ప్రకటనతో పాటు హీరోయిన్ ఎవరనేది కన్ఫర్మ్ అవుతుందేమో చూడాలి?





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com